Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 02.02.2018, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 35 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



## అడుగులో అడుగేసి
# జగన్‌కి తోడుగా నిలిచి...
## ...విపిఆర్

**జిల్లాలో జైత్రయాత్రగా సాగుతున్న వై.యస్.జగన్ పాదయాత్రలో ప్రముఖ సేవాతత్పరుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడుగులు కలిపాడు. జగన్‌తో కలిసి నడిచాడు. జిల్లాలో వైకాపాకు మరింత బలాన్ని జోడించాడు.**

గత కొంతకాలంగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా వుంటున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తిరిగి రాజకీయ ఇన్నింగ్స్ మొదలుపెట్టాడు. తన ఆలోచనలు, ఆశయాల ఆచరణకు వైకాపానే వేదికగా ఎంచుకున్నాడు. అందుకే తానుంటున్న పార్టీ సేవకే అంకితం కావాలనుకున్నాడు. పార్టీలో రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలనుకున్నాడు. ఇందులో భాగంగానే జనవరి 28వ తేదీ ఉదయం 6.30గంటలకే ఆయన ఇంటి వద్ద కోలాహలం నెలకొంది. దాదాపు 150కార్లతో వందలాదిమంది అభిమానులు విపిఆర్‌కు తోడుగా జగన్మోహన్‌రెడ్డితో కలసి నడవడానికి బయలుదేరారు. సుమారు 8.30గంటల ప్రాంతంలో గూడూరు నియోజకవర్గంలోని తిమ్మసముద్రం గ్రామంలో రాత్రి బసచేసిన వసతి ప్రాంగణానికి చేరుకున్నారు. వందలాది మంది అభిమానుల సమక్షంలో జగన్ చిరునవ్వుతో ప్రభాకర్‌రెడ్డిని సాదరంగా ఆహ్వానించి ఆలింగనం చేసుకున్నారు. అక్కడ నుంచి దాదాపు 4గంటలసేపు మధ్యాహ్నం భోజన విరామం వరకు విపిఆర్ తన వెంట వచ్చిన అభిమానుల తోడుగా జగన్‌తో కలసి నడిచారు.

(మిగతా 3వ పేజీలో)

## బాబు
# భజనసేన



- గుండు కొట్టించిన కుటుంబానికే గులాం
- పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేకి సలాం
- ఇదేనా పవన్ రాజకీయ చైతన్యం
- బయటపడ్డ టీడీపీతో బంధం

పవన్ సినిమాల్లోనే కాదు, రాజకీయాల్లోనూ యాక్టరే! అతని డైరెక్టర్ మాత్రం చంద్రబాబేనని తేటతెల్లమైంది. ఆయన యాక్షన్, స్టేజీలపై ఆయన ఆవేశ ప్రసంగాలు అంతా కూడా ప్యాకేజీలో భాగమే. ఈ రాష్ట్రంలో చాలా మంది రాజకీయ పండితులకు మింగుడుపడని ప్రశ్న పవన్‌కళ్యాణ్.

(మిగతా 11వ పేజీలో)

## నెల్లూరుజిల్లాలో...
# 1000 కిలో మీటర్లు చారిత్రాత్మక మైలురాయి!

- జగన్ ప్రజాసంకల్ప యాత్రకు అశేష ప్రజాశీస్సులు

పల్లె హృదయాలను తాకుతూ, పల్లె వాసనలు పీలుస్తూ, పల్లెవాసుల ఆత్మీయ పలకరింపుతో పులకరిస్తూ వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర నెల్లూరు జిల్లాలో దిగ్విజయంగా సాగుతోంది.

(మిగతా 11వ పేజీలో)





# నోట్ల రద్దుతో ప్రజలపై భారం

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**



కేంద్ర ప్రభుత్వం పెద్దనోట్లు రద్దు చేయడంతో కార్పొరేట్, బడా వ్యాపారులకు లాభం చేకూరిందని, 140మంది ప్రాణాలు కోల్పోయారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. నెల్లూరుజిల్లా, నెల్లూరురూరల్ సౌత్‌మోపూరు గ్రామంలో సిపిఐ మండల మహాసభల సందర్భంగా గత నెల 28న నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రధాని విదేశాల నుంచి ఎంత నల్లధనం వెలికితీసారో చెప్పాలన్నారు. జిఎస్టీ పేరుతో ప్రజలపై ఆర్థికభారం మోపారని విమర్శించారు. ప్రజాతంత్ర వాదులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. గోసంరక్షణ పేరుతో దళితులను హత్య చేయడం, దాడులకు పాల్పడటం వంటి సంఘటనలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రం నుంచి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి ఎలాంటి నిధులు తేవడం లేదన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావాల్సి ఉండగా బాబు ప్రపంచ బ్యాంకు అప్పు కోసం తిరుగుతున్నారన్నారు. మిత్రపక్షాలైన బీజేపీ టీడీపీ ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ, రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రావుల వెంకయ్య, పముజుల దశరథరామయ్య, జిల్లా కార్యదర్శి పార్ధసారధి, దామా అంకయ్య, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి, చల్లా నరసయ్య, చిన్న అంకయ్య పాల్గొన్నారు.

# నెల్లూరు కేంద్రంగా జైళ్ళ శాఖ

నెల్లూరు కేంద్రంగా జైళ్ళశాఖ మారబోతుందని శాఖ ఐ.జి జి.జయవర్ధన్ పేర్కొన్నారు. జైళ్ళ శాఖకు సంబంధించిన శిక్షణలు ఇప్పటివరకు హైదరాబాద్‌లో నిర్వహించేవారని, రాష్ట్ర విభజన తర్వాత తొలిసారి నెల్లూరులో వార్డెర్ల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఎంపికైన జైలువార్డర్లకు నెల్లూరులోని ఏపి స్టార్స్‌లో శిక్షణ గత నెల 28న ప్రారంభమైన సందర్భంగా నెల్లూరులోనే ఉంటూ ఆయన శిక్షణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. జైళ్ళశాఖకు ఏపిలో ఇస్తున్నంత ప్రాధాన్యం మరే రాష్ట్రంలో ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలోని జైళ్ళలో ఖైదీలకు ఇబ్బంది లేకుండా అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి జైలులో మినరల్‌వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసామన్నారు. రాష్ట్రంలోని నాలుగు సెంట్రల్ జైళ్ళలో పారిశ్రామికీకరణ వేగంగా జరగబోతోందన్నారు. వివిధ పరిశ్రమల ద్వారా ఖైదీలు అనేక రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారని తెలిపారు. ఏటా రూ.10కోట్ల వరకు వ్యాపారం టర్నోవర్ జరుగుతున్నట్లు వెల్లడించారు. నెల్లూరు సెంట్రల్ జైలులో డెయిరీ ఫాం ద్వారా వారికి కావాల్సిన పాలను వారే ఉత్పత్తి చేసుకుంటున్నారన్నారు. రూ.8లక్షలతో పశువులను కొనుగోలు చేయగా వాటి ద్వారా ఇప్పటివరకు రూ.35లక్షల ఆదాయాన్ని సంపాదించినట్లు తెలిపారు. నెల్లూరు సెంట్రల్ జైలులోని సిబ్బందికి 45క్వార్టర్స్ మంజూరైనట్లు ఐ.జి ప్రకటించారు. ఐ.జి వెంట సెంట్రల్‌జైలు సూపరింటెండెంట్ రవికిరణ్, ఏపి స్టార్స్ ప్రిన్సిపల్ రాజేశ్వరరావు, జైలర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

# పొట్టేపాలెంలో పోలియో చుక్కలు

నెల్లూరురూరల్ పొట్టేపాలెంలో 28వ తేదీ పల్స్ పోలియో కార్యక్రమాన్ని స్థానిక తెలుగుదేశం నాయకులు, శ్రీ కోదండరామస్వామి దేవస్థానం ఛైర్మెన్ పొన్నాల రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సునీల్‌రెడ్డి, రాజేష్, వెంకటరమణయ్య, రమ, శైలజ తదితరులు పాల్గొన్నారు.



పోలియో చుక్కలు వేస్తున్న పొన్నాల రామచంద్రారెడ్డి

# రేషన్ బియ్యం పట్టివేత

పేదప్రజలకు అందజేయాల్సిన రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని విజిలెన్స్ అధికారులు గత నెల 28న పట్టుకున్నారు. నెల్లూరుజిల్లా ఆత్మకూరు పట్టణంలోని రేషన్ షాపు నెం.16 నుంచి 56బస్తాల రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా విజిలెన్స్ డిఎస్పీ సుబ్బారెడ్డి, సి.ఐ నారాయణ, ఏ.ఓ ధనుంజయరెడ్డిలు పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యాన్ని గోదాముకు తరలించి వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ విజిలెన్స్ అధికారులకు అక్రమ రేషన్ బియ్యం తరలింపు సమాచారాన్ని చెప్పిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పేదప్రజలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డి.టి డి.వి.శేషయ్య పాల్గొన్నారు.

# ఎరువు కూడా బరువైంది

- రైతులపై భారం
- సేద్యమే పెద్ద నేరం




విమానాన్ని కనిపెట్టకపోయినా ఈ ప్రపంచం ఆగదు... రాకెట్లను పైకి పంపక పోయినా ఈ ప్రపంచానికేమీ కాదు. చంద్రబాబు కంప్యూటర్లను కనిపెట్టకపోయినా, హైటెక్ సిటీని కట్టించకపోయినా ఈ సమాజం ఆగిపోదు. కాని రైతులంతా ఒక్క సంవత్సరం పంట వేయకపోయినా ఈ ప్రపంచం ఆకలితో అల్లాడిపోతుంది. అలాంటి రైతుకు ఈ ప్రభుత్వాలు ఏమిస్తున్నాయి. ఏం చేస్తున్నాయి?

వ్యవసాయం అన్నది పండుగ అనే స్థాయి నుండి దండగ అనే స్థాయికి దిగజారింది. సేద్యం చేయాలంటే ప్రతిచోటా ఖర్చుతో కూడిన పనే! దుక్కిదున్నే దగ్గర్నుండి నాట్లు, కలుపు, నారు ఏత, నీళ్ళు, కరెంట్, పిండి, మందులు, కోతలు... ఇలా ప్రతి చోటా పెట్టుబడే! బ్యాంకులున్నా సక్రమంగా అప్పులిస్తాయా అంటే బడాబాబులకు ఇచ్చినంత ఉదారంగా అవి రైతులకు ఇవ్వవు కదా! బయట మార్కెట్‌లో రెండు నుండి నాలుగు రూపాయల వరకు వడ్డీలతో అప్పులు చేసి సేద్యం చేయాలి. పంటను పండించాలి. ఇంత చేసి తీరా పంట చేతి కొచ్చే టైంకు మార్కెట్‌లో పంటకు గిట్టుబాటు ధర ఉండదు.

పెరిగిన పెట్టుబడులతో రైతు సతమతమవుతుంటే గోరుచుట్టు మీద రోకటి పోటులాగా ఇప్పుడు యూరియా ధరలను అమాంతం పెంచేసి రైతుపై అదనపు భారం మోపారు. ఇంతవరకు టన్ను డిఏపి ఎరువు 21,852 రూపాయలుండగా, దానిపై 2600 రూపాయలు పెంచారు. కాంప్లెక్స్ ఎరువు టన్ను 17వేల రూపాయలుండగా 2240 రూపాయలు పెంచారు. పెరిగిన ధరల మూలంగా ఒక్క జిల్లా రైతాంగం మీదే 21.50కోట్ల అదనపు భారం పడనుంది. జిల్లా అంతటా దాదాపు 5లక్షల ఎక రాలలో వరిసాగవుతుంది. రబీ, ఖరీఫ్ సీజన్‌లకు సంబంధించి ఎరువుల విని యోగం ఎక్కువుగానే వుంటుంది. అన్నీ కలిపి ఎకరాకు 35వేల దాకా ఖర్చవుతుంది. పెరిగిన ఎరువుల ధరలతో పెట్టుబడి వ్యయం మరింత పెరిగి రైతుకు భారం కానుంది.

# భారీ టెలిస్కోప్‌లతో సూపర్ బ్లూమూన్ వీక్షణ




నెల్లూరు విఆర్ కళాశాలలో ఫిజికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గత నెల 31న టెలిస్కోప్‌ను ఏర్పాటు చేశారు. వందలాది మంది విద్యార్థులు, ప్రజలు అరుదైన బ్లూ, బ్లడ్, సూపర్‌మూన్‌ను చూసేందుకు క్యూ కట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ సైన్స్ హెచ్‌ఓడి డాక్టర్ యం.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు హరిప్రసాద్, కె.రవీంద్ర, విశ్రాంత అధ్యాపకులు రామచంద్రారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని నక్షత్ర స్కూల్లో ఉన్న 130 ఈక్యూ టెలిస్కోప్‌ను సూపర్‌మూన్‌ను తిలకించేందుకు పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ నరేష్, డైరెక్టర్ సంధ్య, ప్రిన్సిపల్ పవిత్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సాహిత్య సేవా పురస్కారాలు ప్రదానం



నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని వర్ధమాన సమాజంలో గత నెల 31న సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవాన్ని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రముఖ పండితుడు సాహితీవేత్త పంచాగ్నుల విశ్వేశ్వరశర్మ స్మృత్యర్థం వివిధ రంగాలకు చెందిన సాహిత్య, సంఘ సేవకులకు పురస్కారాలు అందజేశారు. కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన ప్రముఖకవి డాక్టర్ సంజీవరాయుడు, నెల్లూరుకు చెందిన పద్యకవి టి.వి.నరశింహకుమార్‌లకు సాహిత్య పురస్కారాలు, నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎ.జయప్రకాష్, ప్రిన్స్‌యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇండ్ల కృష్ణయ్యకు సేవాపురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథులుగా ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ కమిటి ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, ఆచార్య ఆదిత్య, అందె శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సర్దార్, బత్తిన సాయికుమార్‌రెడ్డి, వల్లకవి వేంకట సుబ్బారావులు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు సభాధ్యక్షుడుగా వ్యవహరించాడు.

# రిటైర్డ్ తహశీల్దార్, విఆర్ఓ అరెస్ట్

ప్రభుత్వ భూమిని అక్రమంగా ఇతరులకు విక్రయించిన కేసులో రిటైర్డ్ తహశీల్దార్ నారాయణరావు, ప్రస్తుతం సూళ్ళూరుపేట మండలంలో విఆర్ఓగా పనిచేస్తున్న ఖలీల్‌ను గత నెల 27న అరెస్ట్ చేసినట్లు తడ ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు తెలిపారు. 2001లో తడ తహశీల్దారుగా నారాయణరావు, బి.వి.పాళెం విఆర్ఓగా ఖలీల్ పని చేశాడు. ఆ సమయంలో బి.వి.పాళెంలో సర్వే నెంబర్లు 167, 197, 91సిలో 59.73 ఎకరాల ప్రభుత్వ భూమిని తమిళనాడుకు చెందిన వారికి విక్రయించాడు. ఈ భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్‌డీడు వంటి పత్రాలు కూడా ఇచ్చాడు. దీనిపై అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో విచారణ సాగించిన అధికారులు అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. 2014 మార్చి 10న అప్పటి తహశీల్దార్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయించారు. దీంతోపాటు విఆర్వో ఖలీల్ కారూరులో ప్రభుత్వ భూమికి ఒకరికి పొజిషన్ సర్టిఫికేట్ ఇచ్చి డబ్బులు తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణల మేరకు గతంలో గూడూరు సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన గిరీషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రిటైర్డ్ అయిన తహశీల్దార్‌తో పాటు విధుల్లో వున్న విఆర్ఓను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# వి.ఆర్‌కు ఉదయగిరి సి.ఐ

ఉదయగిరి సి.ఐ ఏ.వి.రమణను వి.ఆర్‌కు ఆదేశిస్తూ ఎస్పీ రామకృష్ణ గత నెల 31వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. సి.ఐ రమణపై పలు ఆరోపణలున్నాయి. తరచూ ఎం.ఎల్‌లు పెడుతున్నాడు. మళ్ళీ చేరుతున్నాడు. దీనికితోడు ఆయనపై పలు అవినీతి ఆరోపణలొచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆయనపై వేటు పడింది.

## భగవన్నామ నినాదం..

# సర్వం జగన్నాథం!

**నేత్రపర్వంగా 7వ రథయాత్ర**



నెల్లూరులో జగన్నాథ రథయాత్ర జరిగింది. కలెక్టర్ కార్యాలయం దగ్గర్లోని పెద్దబజారు సెంటర్ నుండి జనవరి 27వ తేది సాయంత్రం సుమారు 5 గంటలకు జగన్నాధుడు యాత్రకు బయలుదేరి నగరంలోని ప్రధాన వీధుల గుండా సాగి రాజీవ్ రహదారి(మినీ బైపాస్)లోని అన్నమయ్య సర్కిల్ వద్ద గల పివిఆర్ కల్యాణమండపం వద్ద ముగిసింది. రథయాత్ర ప్రారంభానికి ముందు జరిగిన కార్యక్రమంలో జపాన్ నుండి విచ్చేసిన భానుస్వామి ప్రభు, తిరుపతి నుండి విచ్చేసిన రేవతి రమణప్రభు, హైదరాబాద్ నుంచి వచ్చిన వేదాంత చైతన్యప్రభు, శ్రీవత్సదాస్ ప్రభు, తమిళనాడు నుండి వచ్చిన శ్రీనివాస్ శ్యాం ప్రభు, జయగోపీనాథ్ దాస్ ప్రభులతో పాటు, విపిఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి వివిధ వార్డుల కార్పొరేటర్లు, ఇతర ప్రముఖులు పాల్గొని తమ సందేశాలను ఇచ్చారు. నెల్లూరు ఇస్కాన్ అభివృద్ధి ప్రదాత, స్ఫూర్తి దాత శుకదేవస్వామి ప్రభు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా భజనలు నిర్వహించారు.

జగన్నాధుని యొక్క మహిమను గురించి జగన్నాథ రథయాత్ర యొక్క ప్రాముఖ్యతను గురించి వచ్చిన ప్రముఖులందరూ తెలియజేసారు. భగవన్నామ స్మరణ వల్ల కలిగే ప్రయోజనం గురించి వివరించారు. కులాలు వేరైనా, మతాలు వేరైనా, భాషలు వేరైనా, ప్రాంతాలు ఎన్నైనా భగవంతుడు మాత్రం ఒక్కడే అని ఏక నినాదంతో పేర్కొన్నారు. రొట్టెల పండుగకు, రంగడి తిరునాళ్ళకు వచ్చినట్లుగా జగన్నాధ రథ యాత్రకు కూడా లోకల్ హాలిడే ప్రకటించే రోజు వస్తుందని, ఈ యాత్ర ఎప్పటికప్పుడు ఆ ప్రాధాన్యతను సంతరించుకుంటుందని 'లాయర్' సంగ్రాహకుడు శివప్రభాత్‌రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. ఇప్పటికే అమెరికా దేశంలోని శాన్‌ఫ్రాన్సిస్కో వంటి రాష్ట్రాల్లో జగన్నాథ రథయాత్ర రోజున ఆప్షనల్ హాలిడే ప్రకటిస్తుండడం గొప్ప విషయమని అన్నారు. ఇస్కాన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ అకుంఠిత దీక్షతో, అంకితభావంతో భక్తితత్వాన్ని పెంపొందిస్తున్న శుక దేవస్వామి అభినందనీయుడని పేర్కొన్నారు.



'పాత వంటకాలు, కొత్త రుచులు... ఆరోగ్యదాయకములు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

జగన్నాధుని ప్రతిమతో రూపొందించబడి ప్రత్యేకంగా జపాన్ నుండి దిగుమతి చేసుకున్న రిస్ట్‌వాచీలను, అలాగే సూళ్ళూరుపేటలో జరగనున్న రథయాత్ర ప్రచార ఫ్లెక్సీని, స్వచ్ఛభారత్ బ్యాగ్‌లను వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆవిష్కరించగా, నిత్య జీవితంలో చిరు ధాన్యాల ఆహారమే ఓ దివ్య ఔషధం అంటూ 'పాత వంటకాలు, కొత్త రుచులు..ఆరోగ్యదాయకములు' పేరుతో శ్రీమతి లోకేశ్వరీ రాధా దేవీదాసి(లక్ష్మి) రచించిన ప్రత్యేక గ్రంథాన్ని శివప్రభాత్‌రెడ్డి ఆవిష్కరించారు.



జగన్నాధుని దర్శించుకున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన తనయుడు సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి

సాయంత్రం భక్తుల జయజయధ్వానాల మధ్య ప్రారంభమైన యాత్ర రాత్రికి ముగిసింది. మార్గ మధ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన తనయుడు రాజగోపాల్ రెడ్డి, ధర్మవరం సుబ్బారావు, డివియస్ గిరి తదితర ప్రముఖులు పాల్గొని జగన్నాధుని ఆశీస్సులను అందుకున్నారు. నెల్లూరు నగరం నుండే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు విచ్చేసి యాత్రలో పాల్గొని జగన్నాధుని సేవలో తరించారు. జై జగన్నాథ!...

# 'రమణీయం'..చిరస్మరణీయం



'రమణీయం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

పద్మశ్రీ అవార్డుకు రేబాల రమణ అర్హులని 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి అన్నారు. నెల్లూరు టౌన్‌హాలులో గత నెల 25న ప్రఖ్యాత రంగస్థల కళాకారుడు, దివంగత రేబాల రమణ కళాత్మక జీవితంపై వీరబ్రహ్మాచారి రచించిన 'రమణీయం' అనే గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ గ్రంథాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య ముద్రించి ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ, రేబాల రమణ అద్భుతమైన నటుడని, ఆయన నటన కళాత్మక జీవితానికే అద్దం పట్టిందని, ఎందరికో ఆదర్శవంతమైన వీరి నటన, అనుభూతులు నేటికీ రంగస్థలాన్ని ప్రభావితం చేస్తున్నాయన్నారు. తన తండ్రి తుంగా రాజగోపాలరెడ్డితో రేబాల రమణకు ఉన్న పరిచయాన్ని, వారి ఆత్మీయతను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. రేబాల కుటుంబ పండుగలా జరుగుతున్న ఈ వేడుక రమణీయం.. కమనీయం.. చిరస్మరణీయం అన్నారు. రేబాల వర్ధంతిని కాకుండా జయంతిని నిర్వహించి రమణ సంస్మరణగా పేద కళాకారులను ఆదుకోవాలని సూచించారు. సినీరంగంలో రాణిస్తున్న రమణ అల్లుడు సంగీత దర్శకునిగా తన నేతృత్వంలో నెల్లూరు గాయనీ గాయకులకు కూడా అవకాశం కల్పిస్తే బాగుంటుందన్నారు. తొలుత రేబాల రమణ సతీమణి రేబాల శ్రీలక్ష్మి, కుమార్తెలు దివిజ, లలితలు రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనం చేశారు. రేబాల రమణ కుటుంబీకులు, ఆత్మీయులు, అభిమానులు, సన్నిహితులు పాల్గొన్నారు. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, వల్లకవి వెంకటసుబ్బారావు, సినీ సంగీతదర్శకుడు, రేబాల రమణ అల్లుడు సాయి కార్తీక్, పాటూరు శ్రీనివాసులు, బొల్లినేని గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు. సభా కార్యక్రమానికి ముందు కళాంజలి అనంత్ నిర్వహణలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

# హరినారాయణరెడ్డికి 'సేవా సామ్రాట్'

ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నటభూషణ్ స్వర్గీయ శోభన్‌బాబు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మన నెల్లూరీయుడు, సాహితీవేత్త కొండూరు హరినారాయణరెడ్డికి 'సేవాసామ్రాట్' పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి ఛైర్మెన్ స్వామిగౌడ్ చేతులమీదుగా అందజేశారు.



# జగన్‌కి తోడుగా నిలచి...

(మొదటి పేజీ తరువాయి)

2014 ఎన్నికలకు ముందే విపిఆర్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం తెలిసిందే! అయితే ఎన్నికల తర్వాత ఆయన కొంతకాలం పాటు రాజకీయాలకు దూరంగా వున్నాడు. వైకాపా కార్యక్రమాలకు కూడా వెళ్ళేవాడు కాదు. ఈ దశలో ఆయనను తమ పార్టీలోకి తీసుకోవాలని తెలుగుదేశం అధిష్టానం చేయని ప్రయత్న మంటూ లేదు. కాని ఎవరి ప్రయత్నాలు ఎలా వున్నా ఆయన మనస్సాక్షి మాత్రం వైకాపా వైపే నిలిచింది. వైకాపాలో ఆయన తిరిగి ఉత్సాహంగా పని చేస్తుండడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది.



విపిఆర్‌తో జగన్ ఆత్మీయ ఆలింగనం



జగన్‌కు తోడుగా అడుగులు కలిపిన విపిఆర్



## 'ప్రభా'తం

# ఏకకాల ఎన్నికలు

దేశంలో ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరుగుతుండడం వల్ల దేశ ఖజానాకు వ్యయభారం కలుగుతోందని, దేశాభివృద్ధిపై దీని ప్రభావం ప్రతికూలంగా ఉంటోందని, అందువల్ల జమిలి ఎన్నికల పట్ల చర్చ జరగాలంటూ ఇటీవల రాష్ట్రపతి, ప్రధాని చేసిన ప్రసంగాలు దేశవ్యాప్తంగా రాజకీయవర్గాల్లోనూ, ప్రజల్లోనూ చర్చనీయాంశమయ్యాయి. ఏదేమైనా, నష్టాలకు కళ్లెంవేసి, దేశం ప్రగతిపథంలో రాణించాలంటే.. వ్యయభరితం కాని ఏకకాల ఎన్నికలే మేలనే భావనే సర్వత్రా వినవస్తోంది.

దేశంలో తరచూ ఏదో ఒకచోట ఎన్నికలు జరుగుతున్నందువల్ల దేశాభివృద్ధికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీనివల్ల ఆర్థికవ్యవస్థపై, అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ఖజానాపై భారాన్ని తగ్గించేందుకు, ప్రజాధనాన్ని ఆదా చేసేందుకు జమిలి ఎన్నికల నిర్వహణపై చర్చ జరగాలి. అందుకు రాజకీయపార్టీలన్నీ ఏకాభిప్రాయానికి రావాలి. కనుక ఈ విషయమై అన్ని పార్టీలు కలసి సమగ్రంగా చర్చించాల్సి ఉంది. – భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

ఏకకాల ఎన్నికలకు అనుకూల వాతావరణాన్ని కలిగించేందుకు అందరూ కృషి చేయాలి. జమిలి ఎన్నికల విషయమై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. – ప్రధాని మోడీ

దేశంలో ముందస్తు ఎన్నికలు రానున్నాయా?..అవి కూడా ఏకకాలంలో (జమిలిగా) వస్తున్నాయా?.. అనే విషయం ఇప్పుడు దేశవ్యాప్తంగా అటు రాజకీయవర్గాల్లోనూ, ఇటు ప్రజల్లోను, సర్వేసర్వత్రా చర్చనీయాంశంగా ఉంది. మొన్నటికి మొన్న అటు రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ప్రధాని మోడీ చేసిన ప్రసంగాల్లో ఏకకాల ఎన్నికల ప్రస్తావన రావడంతో దేశ రాజకీయాలు తాజాగా రసకందాయంలో పడినట్లయింది. దేశంలో ఎక్కడ చూసినా ఇదే చర్చ.. ఇవే మాటలు వినిపిస్తున్నాయి. దేశంలోనూ, రాష్ట్రాల్లోనూ ఎక్కడో ఒకచోట తరచూ ఎన్నికలు జరుగుతుండడం వల్ల ఎంతో ప్రజాధనం వృధా కావడమే కాక, మానవ వనరులు కూడా వృధా అవుతున్నాయని, అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు కూడా ఏర్పడుతున్నాయనే వాదనలు జోరందుకుంటున్నాయి. ఎన్నికల్లో నానాటికీ పెరిగిపోతున్న భారీ వ్యయాన్ని అరికట్టేందుకు ఏకకాల ఎన్నికలు ఎంతో ఉపయోగపడతాయని, అందువల్ల ఏకకాల ఎన్నికలే మేలు అనే భావన ప్రజల్లో కలుగుతోంది. రాజకీయనేతలు ఎప్పుడూ రాజకీ యాలపైనే కాకుండా, దేశాభివృద్ధిపై దృష్టిపెట్టేందుకు కూడా ఈ విధానం ఎంతో బావుంటుందనే అభిప్రాయాలు వినవస్తున్నాయి. అయితే, ఈ ప్రతిపాదన బిజెపికి ఇప్పుడే కాదు.. చాలాకాలం నుంచే ఉంది. దేశంలో ఏకకాలంలో ఎన్నికలు అవసరమంటూ 2012 లోనే బిజెపి సీనియర్ నేత అద్వానీ అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీకి లేఖ రాశారు కూడా. ప్రధాని మోదీ కూడా ఈ అంశాన్ని రెండేళ్ళ క్రితమే మరోసారి అజెండాలోకి తెచ్చిన విషయం అందరికీ తెలిసిందే.

దేశంలో తరచూ ఏదో ఒకచోట ఎన్నికలు జరుగుతున్నందువల్ల దేశాభివృద్ధికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని, ఖజానాపై భారాన్ని తగ్గించేందుకు, ప్రజాధనాన్ని ఆదా చేసేందుకు జమిలి ఎన్నికల నిర్వహణపై చర్చ జరగాల్సి ఉందని తాజాగా భారత రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ సూచించడం అందరినీ ఆలోచింపజేసేదే. ఇటీవల ఉభయసభలను ఉద్దేశించి తొలిసారిగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ, 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అనే ఆలోచన దేశంలో ఎంతోకాలం నుంచి ఉందన్నారు. 1999లో లా కమిషన్ ఈ విషయాన్ని సూచించిందని, పార్లమెంట్ స్థాయీ సంఘం కూడా 2015లో దీనిపై ఒక నివేదిక ఇచ్చిందని, ఒకేసారి ఎన్నికల నిర్వహణ వల్ల ప్రజాధనం ఆదా చేసినట్లవుతుందని పేర్కొన్నారు. తరచూ ఎన్నికలు జరుగుతుండడం వల్ల దేశ ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, ఆర్థికవ్యవస్థపై, దేశాభివృద్ధిపై దీని ప్రభావం ప్రతికూలంగా ఉంటోందని, అందువల్ల జమిలి ఎన్నికల నిర్వహణపై సమగ్రమైన చర్చ జరగాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. దీనిపై రాజకీయపక్షాలన్నీ ఏకాభిప్రాయానికి రావాలని, నవభారత నిర్మాణానికి అందరూ చిత్తశుద్ధితో కలసి పనిచేయాలని సూచించారు. అదేవిధంగా ప్రధాని మోడీ కూడా ఏకకాల ఎన్నికల అంశానికి తన మద్దతునిస్తూ ప్రసంగించారు. ఏకకాల ఎన్నికలకు అనుకూల వాతావరణాన్ని కలిగించేందుకు అంద రూ కృషి చేయాలని, దేశవ్యాప్తంగా దీనిపై చర్చ జరగాలని ప్రధాని సూచించారు. దీంతో, దేశవ్యాప్తంగా ప్రజల్లోను, రాజకీయ వర్గాల్లోను ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఏకకాల ఎన్నికలను ప్రధాని ముందస్తుగానే నిర్వహించాలని అనుకుంటున్నట్లుందని. ముందస్తు ఏకకాల ఎన్నికలకు ఇదొక సూచనేమోనని రాజకీయవర్గాల విశ్లేషణ. ముందస్తు ఎన్నికలకు వెళ్ళడం ద్వారా ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్త పడాలని, ఈ విషయంలో విపక్షపార్టీలకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదనే వ్యూహంతో ప్రధాని మోదీ ఏకకాల ఎన్నికలకు సమాయత్తమవుతున్నారేమోనని మరికొందరు రాజకీయ నిపుణుల భావన. మరోవైపు, మరో మూడు నాలుగునెలల్లోనే ఎన్నికలు నిర్వహించేందుకు కూడా మోదీ ఆలోచిస్తున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో కలవరం కలిగిస్తోంది. ఇదిలావుంటే, ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల నష్టాలు కూడా ఉన్నాయనే అభిప్రాయాలూ జోరుగానే ఉన్నాయి. వేర్వేరు ఎన్నికల వల్ల పాలకుల్లో జవాబుదారీతనం పెరుగుతుందని, త్వరలో మళ్లీ ఎన్నికలు వస్తాయనే ఆలోచన ఉంటే పాలకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించే అవకాశం తక్కువగా ఉంటుందని, అందువల్ల వేర్వేరు ఎన్నికలు మంచిదేనని భావించేవారు కూడా లేకపోలేదు. ఈ నేపథ్యంలో ఒకవేళ ముందస్తు ఏకకాల ఎన్నికలు వస్తే ఏమిచేయాలనే ఆలోచనలు విపక్ష నేతలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

ఏదేమైనా, దేశాభ్యున్నతి కోసం జరిగే ఏ విధానానికైనా, ఎలాంటి సంస్కరణకైనా ప్రజల ఆమోదం ఎలాగూ ఉంటుందని వేరే చెప్పనక్కర లేదు. అందువల్ల వ్యయభరితం కాని ఏకకాల ఎన్నికలు మేలనే భావనే ప్రజల్లో అధికంగా ఉంది. ఏదెలావున్నా.. ప్రజాపాలన పారదర్శకంగా, సకల జనరంజకంగా జరగడమే అందరికీ కావాల్సింది. ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నప్పుడే ఏ విధానానికైనా సార్థకత. దేశాభ్యున్నతి, ప్రజల అభ్యున్నతితోనే ముడివడివుంటుంది కనుక, దేశసమగ్రాభివృద్ధే లక్ష్యంగా అందరూ కలసి ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగా మంచి విధానాలను పాటిస్తూ ముందుకు సాగాలి. అప్పుడే దేశం ప్రగతి పథంలో రాణిస్తుంది!... నవభారత్ స్వప్నం సాకారమవుతుంది!....

# ఆధ్యాత్మికతతోనే మానవ జీవితాలకు సార్థకత

### - శ్రీ రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ సభలో స్వామీజీలు

ఆధ్యాత్మికత మానవ జీవితాలకు సార్థకత చేకూరుస్తుందని శ్రీరామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ పూజ్య స్వామీజీలు పేర్కొన్నారు. గత నెల 28న నెల్లూరు విఆర్ కళాశాల మైదానంలో శ్రీరామకృష్ణ సేవాసమితి స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని శ్రీరామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక బహిరంగ సభ నిర్వహించారు. వేలాదిమంది శ్రీరామకృష్ణ, వివేకానందుని శిష్యబృందం, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్న ఈ సభలో స్వామీజీలు బోధమయానంద మహరాజ్(హైదరాబాద్), ఆత్మవిదానంద స్వామీజీ(విశాఖపట్నం), అనుపమానందజీ మహరాజ్(తిరుపతి), రఘునాయకానందజీ మహారాజ్(హైదరాబాద్)లతో పాటు నెల్లూరుకు చెందిన బత్తిన సాయికుమార్ రెడ్డి, డా॥ ఎం.మోహన్‌రాజులు ఉపన్యశించారు. ప్రజలు అనేకమైన ఒత్తిళ్ళతో సతమతమవటానికి ప్రధాన కారణం ఆధ్యాత్మికతను మరచిపోవడమేనన్నారు. ఆధ్యాత్మికత అనుభూతిని పొంది, మానవులు పరివర్తనతో భగవంతుని చేరుకొనేందుకు ప్రయత్నించాలన్నారు. కలియుగానికి భక్తియోగం అనుసరణీయమైందన్నారు. శ్రీరామకృష్ణులు, వివేకానందుల స్ఫూర్తితో ముందుకు సాగితే విజయం తప్పక లభిస్తుందన్నారు. శ్రీరామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు సివిఎస్ భాస్కర్, కార్యదర్శి మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యర్కమంలో సంప్రదాయ సాధువులు, మాతాజీలు, రాయలసీమ విభాగం కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి దర్గామిట్టలోని స్వర్ణవేదిక కళ్యాణ మండపంలో భక్తి సమ్మేళనం, మహిళా సదస్సు, ఉపన్యాస కార్యక్రమాలు జరిగాయి.



ఉపన్యసిస్తున్న రఘునాయకానందజీ మహారాజ్

## వైభవంగా భీష్మ ఏకాదశి

నెల్లూరురూరల్ మండలం నరశింహ కొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరశింహ స్వామి దేవస్థానంలో భీష్మ ఏకాదశిని గత నెల 27న భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం లక్ష తులసిపూజ, పూలంగిసేవ నిర్వహించారు. రాత్రి 7గంటలకు కళ్యాణోత్సవం, గిరిప్రదక్షణ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ మల్లినేని వెంకటేశ్వర రావు, ఇ.ఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.




## కులంతో జతపరచడం సిగ్గు చేటు

స్వరబ్రహ్మ ఇళయరాజాకు కేంద్రం పద్మవిభూషణ్ అవార్డును ప్రకటించడం అభినందనీయం. సంగీత ప్రపంచానికి ఆయన చేసిన సేవలకు బహుమానం. ఈ అవార్డుకు ఓ సంగీత దర్శకుడిగా ఆయన అన్ని విధాలా అర్హుడు. కాని, ఓ ఆంగ్ల దినపత్రికలో దళితుడి కోటాలో ఇళయరాజాకు పద్మవిభూషణ్ అవార్డునిచ్చినట్లు వ్రాసి ఆయన ప్రతిభను తక్కువ చేసి చూపారు. భారత ప్రజలకు, సంగీతాభిమానులకు ఆయన ఓ గొప్ప సంగీత స్వరబ్రహ్మగానే తెలుసు. ఆయన కులం గురించి, మతం గురించి ఎవరికీ తెలియదు. ఆయన పాట వినాలనే ధ్యాస తప్ప ఆయన మూలాలు తెలుసుకోవాలనే ఆశ లేదు. కేవలం మీడియా వాళ్లే ప్రజలకు ఈ కులగజ్జినంటిస్తున్నారు.

**జి. చంద్రశేఖర్, చెన్నై.**

## పవన్‌ది మానసిక వైరాగ్యం

పవన్‌కళ్యాణ్‌కు మానసికంగా ఏదో సమస్య వుంది. కాబట్టే ఏ పెళ్ళాం కుదురుగా నిలబడలేదు. ఆయన చేష్టలు విపరీత ధోరణితో వుంటున్నాయి. స్టేజీలెక్కి ప్రసంగాలు చేసేటప్పుడు మధ్య మధ్యలో ఉన్నట్లుండి ఆవేశానికి లోనవుతుంటాడు. సినిమాలలోనూ ఎంతో పెద్దనటుల చేత తన చెప్పులు మోయించడం, వారి చెంపలు పగుల గొట్టడం వంటి సీన్‌లలో ఆయన మానసికస్థితి వికృతంగా కనిపిస్తుంది. ఇక ఆయన రాజకీయంగా వేస్తున్న అడుగులు కూడా ఆయన మానసిక దౌర్భాగ్యానికి నిలువెత్తు నిదర్శనం.

**పోలంకి సుధాకర్, తిరుపతి.**

## దావోస్ వెళ్ళి ఏం పొడిచినట్లు?

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే చాలా విదేశీ పర్యటనలు చేసొచ్చాడు. అంతర్జాతీయ సదస్సులకు నేనే ఇండియా ప్రతినిధిని అన్నట్లుగా వెళ్లొస్తున్నాడు. కోట్లు కోట్లు స్పెషల్ ఫ్లైట్లకు తగలేస్తున్నాడు. విదేశీ పర్యటన చేసొచ్చిన ప్రతిసారీ వేల కోట్ల పెట్టుబడులు, భారీఎత్తున ఉద్యోగాలు అంటున్నారు. కనీసం ఈ నాలుగేళ్లలో చంద్రబాబు టూర్లకు అయిన ఖర్చుకు సరిపడానన్నా పెట్టుబడులొచ్చాయా? అయినా పెట్టుబడులు విదేశాలు తిరిగి అడుక్కుంటే వస్తాయా? రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పిస్తే వస్తాయా? వై.యస్. ఎన్నిసార్లు విదేశీ పర్యటనలు చేసాడని ఆయన కాలంలో భారీగా పెట్టుబడులొచ్చాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి కావాల్సింది విదేశీ టూర్లు కాదు, చిత్తశుద్ధి.

**కలిచేడు నాగార్జున, గూడూరు.**

## అహంకారం పనికిరాదు

రిపబ్లిక్‌డే వేడుకలలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి నాలుగోవరుసలో సీటు కేటాయించి నరేంద్రమోడీ సర్కార్ తన అహంభావ వైఖరిని చాటుకుంది. ఆసియాన్ దేశాల అధినేతలను గౌరవించడంలో తప్పులేదు. అందుకోసం మన నాయకులను అవమానించాలా? ఇలాంటి చర్యలను ప్రజలు హర్షించరు. నరేంద్ర మోడీ ఇలాంటి నియంతృత్వ ధోరణులను మార్చుకోవాలి.

**– పైడిశెట్టి రాజేష్, నెల్లూరు.**

## నెల్లూరులో టీడీపీ పరిస్థితిపై...

# బాబుకు బి.పి








**తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు మనుషులను, వారి మాటలను నమ్మడు. ఆయన నమ్మేది కంప్యూటర్లను, డ్యాష్‌బోర్డు సమాచారాన్ని, ఇంటలిజెన్స్ నివేదికలను, సర్వే సంస్థల రిపోర్ట్‌లను. రాష్ట్రంలో తన పార్టీ పరిస్థితి ఎలా వుంది, తమ నాయకుల పనితీరు ఎలా వుంది అన్నదానిపై ఆయన తరచూ సర్వేలు నిర్వహిస్తుంటాడు. ఈ సర్వే ఫలితాలు ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తుంటాడు.**

ఇటీవల నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితులపై నిర్వహించిన సర్వేలో నెల్లూరు జిల్లా నుండి ఆయనకు చేదు ఫలితాలే చేరాయి. నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు లేదా ఇన్‌ఛార్జ్‌ల పనితీరును బట్టి ఏ ప్లస్, ఏ, బి,సి గ్రేడ్‌లుగా ర్యాంకులు ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అమలయ్యే విధానం, వాటిపై ప్రచారం, జన్మభూమి కార్యక్రమాల నిర్వహణ, పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తల సమావేశాలు, ప్రజల్లో వచ్చిన సానుకూలత, లేదా పెరిగిన వ్యతిరేకత వంటివి దృష్టిలో పెట్టుకుని ఈ గ్రేడ్‌లను విభజించుకుంటూ వచ్చారు.

జిల్లాలో పది అసెంబ్లీలుంటే ఒక్క అసెంబ్లీ నియోజకవర్గానికి కూడా ఏ ప్లస్ గ్రేడ్ రాలేదు. వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాలకు మాత్రం ఏ-గ్రేడ్‌లు దక్కాయి. విచిత్రమేంటంటే ఈ రెండు నియోజకవర్గాలలోనూ సిటింగ్ ఎమ్మెల్యేల మీద తీవ్ర వ్యతిరేకత వుంది.

ఇక నెల్లూరు నగరం, నెల్లూరురూరల్, కోవూరు, కావలి, సర్వేపల్లి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు బి-గ్రేడ్‌లు దక్కాయి. నెల్లూరు నగరంలో ఒకరికి నలుగురు నాయకులు తంటాలు పడుతున్నారు. మంత్రి నారాయణ కూడా అప్పుడప్పుడూ వారికి తోడవుతున్నాడు. కాకపోతే నాయకులు నలుగురు నాలుగు దారులన్నట్లుగా వుండడంతో ఇక్కడ పార్టీ బలం పుంజుకోవడం లేదు. నెల్లూరురూరల్ ఇన్‌ఛార్జ్‌గా ఆదాల ప్రభాకర్‌రెడ్డి పూర్తి స్థాయిలో కష్టపడుతున్నప్పటికి ఆశించిన ఫలితాలు రావడం లేదు. కోవూరులో వర్గ విభేదాలు పార్టీపై ప్రభావం చూపిస్తున్నాయి. ఆత్మకూరులోనూ ఆనం వర్గ సమీకరణ పూర్తి స్థాయిలో జరగలేదు. ఆనం వల్ల పార్టీలోకి కొత్తగా వచ్చి చేరిన వాళ్లెవరూ లేక పోగా వున్న పార్టీయే రెండుగా చీలింది. కావలిలో బీద మస్తాన్‌రావు పూర్తిస్థాయిలో మనసు పెట్టడం లేదు. ఉదయగిరిలో ఎమ్మెల్యేపై పార్టీ శ్రేణుల్లోనే అసంతృప్తి వుంది. సర్వేపల్లిలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బాగానే తిరుగుతున్నాడు. తన కొడుకు రాజగోపాలరెడ్డినే పూర్తిస్థాయిలో తిప్పుతున్నాడు. పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తున్నాడు. అయినా కూడా ఈ నియోజకవర్గాన్ని బి గ్రేడ్‌లో చూపించారు. అన్నింటికంటే అధ్వాన్నం సూళ్ళూరుపేటకు సి-గ్రేడ్ లభించడం. ఇన్‌ఛార్జ్ పరసా రత్నంకు ఇప్పటికే పెట్టాల్సిన కాడికి పెట్టారు.

ఇక ఎన్నికలకు గట్టిగా ఏడాది సమయముంది. ఈలోపు పార్టీ పుంజుకోకుంటే జిల్లాలో చాలా నష్టపోవాల్సి వస్తుంది. ఈ దిశగానే టీడీపీలో దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టినట్లుగా తెలుస్తోంది.








## వైసిపిలోకి...

# వేనాటి!



ఈ జిల్లాలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులలో మొదటి వాడు వేనాటి రామ చంద్రారెడ్డి. 1983లో పార్టీ పెట్టినప్పటి నుండి ఆయన పార్టీలోనే వున్నాడు. ఆయనకు స్వర్గీయ వై.యస్.రాజశేఖరరెడ్డి, మాగుంట సుబ్బరామిరెడ్డిలతోనే కాకుండా ఈ జిల్లాలో బలమైన రాజకీయ కుటుంబమైన ఆనం కుటుంబంతోనూ సన్నిహిత సంబంధాలున్నాయి. వీళ్ళ కోసం కూడా ఆయన ఎప్పుడూ పార్టీ మారలేదు. కాని, గత నాలుగేళ్ళుగా పార్టీలో ఆయన ఎదుర్కొంటున్న అవమానాలు, పరాభవాలు చూసి ఆయన కుటుంబసభ్యులే విసుగెత్తిపోయారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక సూళ్ళూరుపేటలో వీరి పెత్తనాన్ని తగ్గించే ప్రయత్నాలు జరిగాయి. ఇతర పార్టీల నుండి వచ్చిన వాళ్ళకు పెద్దపీట వేస్తూ వచ్చారు. వేనాటి రామచంద్రారెడ్డికి కనీసం ఒక చిన్న నామినేటెడ్ పదవి కూడా రాలేదు.. అయినా కూడా ఆయన అవమానాలను భరిస్తూ పార్టీలోనే వున్నాడు.

కాని, ఆయన కొడుకు, సూళ్ళూరుపేట మున్సిపల్ కౌన్సిలర్ వేనాటి సుమంత్‌రెడ్డి మాత్రం ఇటీవల జగన్ పాదయాత్రలో పాల్గొన్నాడు. వైసిపిలో చేరనున్నట్లు ప్రకటిం చాడు. తమ కుటుంబానికి టీడీపీ చేసిన అన్యాయాన్ని వివరించారు. వేనాటి సుమంత్ ఎప్పుడైతే తిరుగుబాటు జెండా ఎగురవేసాడో అప్పుడే జిల్లా తెలుగుదేశం నాయకులు మేలుకున్నారు. ఆఘమేఘాల మీద వేనాటి కుటుంబసభ్యులతో సమావేశమయ్యారు. తాము తెలుగుదేశం వదిలి పోవడం లేదని వారిచేత స్టేట్‌మెంట్లిప్పించారు.

ఏదేమైనా సుమంత్ తిరుగుబాటుతో వేనాటి వర్గంలో కదలిక వచ్చింది. వేనాటి వర్గీయులు ఎక్కువమంది వైకాపావైపే చూస్తున్నారు. ఈరోజు సుమంత్‌రెడ్డి... రేపు ఆయన బాటలో కుటుంబం మొత్తం నడిచినా ఆశ్చర్యం లేదు.

# మారని మువ్వా!

## మళ్ళీ ప్రభుత్వానికి సరెండర్



**ఒక్కొక్కరికి ఒక్కో సహజ లక్షణం ఉం టుంది. ఎన్ని చెప్పినా, ఎన్నిసార్లు పనిష్ మెంట్లు ఇచ్చినా ఆ సహజలక్షణాన్ని మార్చు కోలేరు. పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకలతో గాని పోదంటారు కదా... ఈ సహజ లక్షణాలు కూడా అటువంటివే!**

మువ్వా రామలింగం... ఈ పేరు వినగానే జిల్లాలో ఎవరికైనా గుర్తొచ్చేది వివాదాలు, అక్రమాలు. ఎక్కడ పనిచేస్తున్నా, లేదా ఎక్కడకి బదిలీపై వెళ్తున్నా ఆయన వివాదాలను చంకలో పెట్టుకుని పోతుంటాడు. జిల్లా విద్యాశాఖాధికారిగా వుంటూ పలు ఆరోపణలకు గురైన మువ్వాను గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అయితే ఆయన జిల్లాలోనే వుండాలని చెప్పి పైరవీలు చేసి బి.ఇడి కళాశాల ప్రిన్సిపాల్‌గా పోస్టింగ్ తెచ్చుకుని గత ఏడాది నవంబర్ 1న బాధ్యతలు తీసుకున్నాడు. అయితే కొద్ది రోజులకే మళ్ళీ అక్కడ వివాదాలకు ఆజ్యం పోశాడు. మువ్వా చర్యలపై ఆగ్రహించిన అక్కడి సిబ్బంది, బిఇడి ట్రైనింగ్ విద్యార్థులు, పాఠశాలల విద్యాశాఖ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల నెల్లూరుకొచ్చిన విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి కూడా బి.ఇడి కళాశాల గొడవలపై కలెక్టర్‌ను వివరణ కోరినట్లు తెలిసింది. దీంతో కలెక్టర్ ఆదేశాలతో తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ శ్రీమతి ప్రశాంతి బి.ఇడి కళాశాలలో ఏం జరిగిందనే దానిపై విచారించి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక ఆధారంగానే మువ్వా రామలింగంను బి.ఇడి కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతల నుండి తప్పిస్తూ ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బి.ఇడి కళాశాలకు ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్‌గా డి.ఇ.ఓ శ్యామ్యూల్‌ను నియమించారు.

తన ఉద్యోగ జీవితంలో మువ్వా రామలింగం వివాదాలు లేకుండా పని చేసిన దాఖలాలు లేవు. 1997 ప్రాంతంలో జిల్లా డిప్యూటీ డి.ఇ.ఓగా పని చేశాడు. అప్పుడంతా వివాదాలు, అయ్యవార్లతో విభేదాలమయమే. ఆ తర్వాత గుంటూరు, కర్నూలు, ఒంగోలులలో డి.ఇ.ఓగా పని చేసినా గొడవలు, ఏసిబి కేసులు. నెల్లూరుకు వచ్చాక కూడా అదే వివాదాలు... ఇతను మారడంతే!

# పేద విద్యార్థులకు విపిఆర్ కిట్లు



విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు

ప్రతిఏటా విపిఆర్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ అంబత్తూర్ మరియు కెనడా దేశానికి చెందిన స్కా స్వచ్ఛంద సంస్థల ఆధ్వ ర్యంలో జిల్లాలోని ఆయా పాఠశాలల్లో చదివే వందలమంది పేద విద్యార్థులకు వారి చదువుకు, వసతికి అవసరమైన వస్తువులతో కిట్లను అందిస్తూ వస్తున్నారు. ఆ పరంపరలో భాగంగానే జనవరి 27వ తేదీన నెల్లూరురూరల్ కనుపర్తిపాడులోని విపిఆర్ విద్య కార్యాలయంలో ఈ మూడు సంస్థల ఆధ్వర్యాన 625మంది పేద విద్యా ర్థులకు ఒక్కోటి 5వేల రూపాయల విలువ చేసే కిట్‌లను అందజేశారు. జిల్లాలోని 46 మండలాలలో 47 ప్రభుత్వ పాఠశాల లలోని 3వ తరగతి పేద విద్యార్థులను ఈ కిట్‌లకు ఎంపిక చేశారు. గత 8 ఏళ్ళుగా పేద విద్యార్థులకు మంచి సౌక ర్యాలు అందించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు విపిఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరి స్తున్న ప్రతిఒక్కరికీ ఆయన ధన్యవాదాలు చెప్పారు.

ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ఆచార్య వి.నారాయణరెడ్డి, విపిఆర్ విద్య ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, శంకర్, కెనడా ప్రతినిధులు థెరిసాక్రవెట్ట, జాన్ ఓ డొన్నెల్, మైక్ కర్రవెట్ట, బ్రెండాటేలర్, కె మౌంట్‌ఫోర్డ్, జెన్నిఫర్ ఓ డొన్నెల్, రోటరీ క్లబ్ అంబత్తూర్ ప్రతినిధులు జి.విశ్వ నాథం, జి.రవిశంకరన్, పి.ఎస్.రాందాస్ తదితరులు పాల్గొన్నారు.



కెనడా బృందంతో వేమిరెడ్డి దంపతులు

## సహకార సంఘాల పదవీకాలం పొడిగింపు

రాష్ట్రంలోని ప్రాథమిక సహకార సంఘాల పాలక మండళ్ళు 2013 జనవరి 31న, సహకార బ్యాంకులు 2013 ఫిబ్రవరి 18న, ఫిబ్రవరి 27న రాష్ట్ర సహకార బ్యాంకు(ఆప్కాబ్) పాలకమండలి పదవీ బాధ్యతలు చేపట్టాయి. రాష్ట్రంలో క్రెడిట్ సొసైటీలు కూడా ఆ ఏడాదిలోనే ఎన్నికయ్యాయి. కాగా, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పదవీకాలం ఈ ఏడాది జనవరి 31, ఫిబ్రవరి 3వ తేదీల నాటికి ముగుస్తుంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల పాలకమండలి పదవీ కాలం ఫిబ్రవరి 17న, రాష్ట్ర సహకార బ్యాంకు పాలకమండలి పదవీ కాలం ఫిబ్రవరి 26వ తేదీతో ముగియనున్నాయి. వీటన్నింటి పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ గత నెల 29న జీవోఎంఎస్ నెంబర్ 8ని ప్రభుత్వం విడుదల చేసింది.

## నెల్లూరు కబుర్లు

# టూర్‌లో నుడా టీమ్



అహ్మదాబాద్‌లోని గాంధీ ఆశ్రమంలో నుడా టీమ్

నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైస్‌ఛైర్మెన్ ఢిల్లీరావు వారి బృందం నెల్లూరును ఎలా అభివృద్ధి చేయాలనే దానిపై పరిశీలన జరిపేందుకు ముంబై, అహ్మదాబాద్‌లలో పర్యటించారు. అక్కడ ఎయిర్‌పోర్టులు, బస్‌స్టేషన్‌లు, మెట్రో స్టేషన్‌లు, హౌసింగ్ ప్రాజెక్ట్‌లను, కమర్షియల్ కాంప్లెక్స్‌లను, రోడ్లను, ఫుట్‌పాత్‌లను, ఓవర్‌బ్రిడ్జిలను పరిశీ లించారు. వాటిలాగే నెల్లూరును అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. మరి వీరి టూర్ సరే... ఆలోచనలే ఎంతవరకు ఆచరణ రూపం దాలుస్తాయో చూడాలి!

# గోపిశెట్టి శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ విరాళం



విరాళాన్నందజేస్తున్న జె.వి.రెడ్డి, వొమ్మిన సుబ్రహ్మణ్యం

1999 సంవత్సరంలో స్వర్గీయ గోపిశెట్టి శంకరయ్య స్థాపించిన గోపిశెట్టి శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన ఆశయాల మేరకు ట్రస్టు సమాజసేవలో భాగంగా గత నెల 30న అనాథ శరణాలయంలో అనాథపిల్లలకు పౌష్టికాహారాన్ని సరఫరా చేయుటకు నెల్లూరు ప్రగతి చారిటీస్‌కు రూ.50వేలు, బెతెల్ ఆర్ఫనేజ్‌కు రూ.50వేలు, గొల్లపాళెం చైల్డ్‌కు రూ.50వేలు, నెల్లూరు సింహపురి ట్రస్టుకు రూ.50వేలు చొప్పున విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మెన్ జె.వి.రెడ్డి, ట్రస్టీలు వొమ్మిన సుబ్రహ్మణ్యం, యస్.ఎ.యస్. రామకృష్ణారెడ్డి, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నెల్లూరు కార్పొరేషన్‌కు 50కోట్లు

- మంజూరు చేయించిన మంత్రి

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల కోసం మున్సిపల్ మంత్రి పి.నారాయణ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ క్రింద 50కోట్లు నిధులు విడుదల చేయించారు. ఈ నిధులతో మార్చి31 లోగా పనులు పూర్తిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# పోలీసు కుటుంబానికి చేయూత



నెల్లూరుజిల్లా అల్లూరు పోలీస్‌స్టేషన్లో పనిచేస్తూ మరణించిన బి.వెంకటరమణయ్య కుటుంబానికి గత నెల 30న జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఉత్తర్వులు మేరకు అడిషనల్ ఎస్పీ బి.శరత్‌బాబు భద్రత సెటిల్మెంట్ రూ.4లక్షల చెక్కును మృతుడి భార్య బి.సుబ్బరత్నమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన పోలీస్ కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఏ.ఓ ఎం.సంపత్, బి-సెక్షన్ సూపరింటెండెంట్ ఎన్.రామనారాయణరెడ్డి, గుమస్తా వి.తులశీరాంలు పాల్గొన్నారు.

# బ్రహ్మాండంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హరిత, పక్కన ఆలయ ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి

నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 8 నుండి 18వ తేదీ వరకు శివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో 27వ తేదీ ఆలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆర్డీఓ హరిత, కార్పొరేటర్ నూనె మల్లిఖార్జునయాదవ్, ఇ.ఓ పాయసం నాగేశ్వరరావు, డిఎస్పీ మురళీకృష్ణ, ఆలయ పాలకమండలి సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల గోడపత్రికను వారు ఆవిష్కరించారు. అనంతరం బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆర్డీఓ హరిత సమీక్షించారు.

### సిఎంఆర్ - చందనలలో

# ముగిసిన సంక్రాంతి బహుమతుల మేళా



లక్కీడ్రా తీసి విజేతను ప్రకటిస్తున్న ముక్కాల ద్వారకానాథ్

క్రిస్‌మస్, న్యూఇయర్, సంక్రాంతి పండుగల సందర్భంగా నెల్లూరులోని సిఎంఆర్-చందన మాల్‌లో నిర్వహించిన అమేజింగ్ సేల్ బహుమతుల మేళా గత నెల 28వ తేదీ సంక్రాంతి కారు బంపర్ డ్రాతో ముగిసింది. నెల్లూరు డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ చేతుల మీదుగా కారు బంపర్‌డ్రా తీయగా, నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటకు చెందిన రఘురామ్ విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలకు ఆయన బహుమతులందజేశారు. వినియోగదారులనుద్దేశించి ద్వారకానాథ్ మాట్లాడుతూ నాణ్యమైన వస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలు తక్కువ ధరలకే అందించడం సిఎంఆర్ షాపింగ్‌మాల్ వారికే సాధ్యమని చెప్పారు. సిఎంఆర్ మాల్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పండుగల సందర్భంగా తాము ప్రవేశపెట్టిన అమేజింగ్ సేల్‌ను ప్రజలు విశేషంగా ఆదరించారంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య మాట్లాడుతూ తక్కువ ధరలు, ఎక్కువ నాణ్యతలో వస్త్రాలు, బంగారు ఆభరణాలు అందించడంలో సిఎంఆర్, చందనలకు తిరుగులేదన్నారు. ఈ కార్యక్రమంలో శైలేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవార్డునందుకున్న జేసీ



నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్‌అహ్మద్ ఇటీవల విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎన్.రమేష్‌కుమార్ చేతుల మీదుగా బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డునందుకున్నారు. ఈ పురస్కారం అందుకున్న జేసీ ఇంతియాజ్‌ను జిల్లా రెవెన్యూ అధికారులు, సిబ్బంది అభినందించారు.

# వ్యాస రచన పోటీలు



మాట్లాడుతున్న డా॥ ప్రభాకర్

నెల్లూరు విఆర్ కళాశాల గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈ నెల 30న విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి డా॥ నరమాల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతివ్యక్తి తను ఎంచుకున్న రంగంలో విజేతగా నిలవాలంటే పఠనా శక్తిని పెంచుకుని, పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. దేశభక్తిని ప్రభోదించే మహనీయుల జీవిత చరిత్రలను చదివి వారి ఆలోచనలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలన్నారు. అధ్యాపకులు డా॥ టి.వి.రవీంద్రరెడ్డి, బాబు, హనుమంతుకుమార్, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

# వైశ్య సమాఖ్య ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి

అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షులు కె.వి.చలమయ్య ఆధ్వర్యంలో గత నెల 30న మహాత్మాగాంధీ 70వ వర్ధంతి సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ మద్యపాన నిషేధాన్ని నేటి ప్రభుత్వాలు అమలు చేయడం లేదని, గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ఆచరించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ వైశ్య సమాఖ్య అధ్యక్షులు తిరువీధి ప్రకాష్‌రావు, పి.పార్ధసారధి, ఆర్.వి.శరత్, పి.నాగేశ్వరరావు, నగరికంటి రవికుమార్, దరిశి నరశింహారావు, బి.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



### వైకాపా మహిళా విభాగం

# అధ్యక్షురాలిగా గౌరి



వైసిపి నెల్లూరు పార్లమెంట్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా మొయిళ్ళ గౌరీని నియమించారు. తన సేవలను గుర్తించి పార్టీ ఈ బాధ్యత అప్పగించినందుకు ఆనందంగా వుందని, పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. తనకి ఈ పదవి రావడానికి కారణమైన నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి, పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, ఎం.పి మేకపాటి రాజమోహన్‌రెడ్డికి, ఇతర జిల్లా ప్రజాప్రతినిధులకు, పార్టీ నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గౌరిని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు.

# మన సంస్కృతి వరమే... సూర్య నమస్కారం


సూర్య నమస్కారాలు చేస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ ముత్యాలరాజు, జేసీ ఇంతియాజ్

మానసికంగా, శారీరకంగా దృఢంగా వున్న సమాజమే అభివృద్ధి చెందుతుందని పురపాలకశాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. గత నెల 28 ఉదయం నెల్లూరు విఆర్‌సి మైదానంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన సూర్య నమస్కారాలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పురాణాల్లో సూర్య నమస్కారాలకు అత్యంత ప్రాధాన్యత వుందని, డి-విటమిన్ సూర్యకిరణాల నుండి మానవులకి లభిస్తుందన్నారు. కండరాలు, ఊపిరితిత్తులు సక్రమంగా పనిచేయడానికి సూర్యనమస్కారాలు, యోగా దోహదం చేస్తాయని మంత్రి తెలిపారు. యోగా ప్రాశస్త్యాన్ని ప్రధాని మోడీ అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళారని అన్నారు. యోగా భారతీయ సంస్కృతిలో ఒక భాగమైందని, వయసు తారతమ్యం లేకుండా ప్రతిఒక్కరూ యోగాను పాటించాలని మంత్రి కోరారు.

జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు మాట్లాడుతూ ప్రతివ్యక్తి సూర్యోదయానికి ముందే లేచి ఆరోజు కార్యక్రమాలను నిర్దేశించుకోవాలని, రాత్రికి ఆరోజు తాను చేసిన పనులు సమీక్షించుకోవాలన్నారు. సూర్యకిరణాలు సముద్రపు నీటిని ఆవిరి రూపంలో సంగ్రహించి వర్షాల ద్వారా మంచినీటిని అందించే అత్యంత విలువైన శక్తి అన్నారు. యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలన్నారు.

ఎపిఐఐసి ఛైర్మన్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రకృతికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమంలో భాగమే సూర్యనమస్కారాలని తెలిపారు. మాజీశాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ బాల్యం నుండే పిల్లలకు యోగా నేర్పాలన్నారు. అంతకుముందు గురుకృప నాట్య మండలి ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలపై ప్రభుత్వం రూపొందించిన గేయానికి చేసిన నృత్యప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం నెల్లూరుజిల్లా యోగా మిత్రమండలి ఆధ్వర్యంలో 12రకాల యోగాసనాలు ప్రదర్శన రూపంలో చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్, జాయింట్ కలెక్టర్-2 వెంకటసుబ్బారెడ్డి, తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ ప్రశాంతి, ఆర్.డి.ఓ శ్రీమతి డి.హరిత తదితరులు పాల్గొన్నారు.



# ప్రారంభమైన ఏసిబి కార్యాలయం

నెల్లూరు బట్వాడిపాలెం వద్ద కార్పొరేట్ స్థాయిలో అత్యాధునికంగా నిర్మించిన అవినీతి నిరోధక శాఖ కార్యాలయ భవనాన్ని జనవరి 27వ తేదీన రాష్ట్ర మంత్రులు అమర్‌నాథ్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, ఏసిబి డిజిపి ఆర్.పి. ఠాకూర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు తమ ప్రసంగాలలో అవినీతిని అంతమొందించాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని గట్టిగా చెప్పారు. అవినీతి అనే పదమే ముఖ్యమంత్రి చంద్రబాబుకు పడదని, అవినీతి అంతానికి ఆయన కంకణం కట్టుకున్నాడని చెప్పారు. అవినీతి రహిత రాష్ట్రం కోసం చంద్రబాబు కలలు కంటున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా ఏసిబి కార్యాలయంలోని అన్ని గదులను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఏపి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి, ఏసిబి అడిషనల్ డైరెక్టర్ పి.హరికుమార్, ఓఎస్‌డి అబ్రహాం ఎరిక్సన్, జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ, నెల్లూరు ఏసిబి డిఎస్పీ పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సిఇజడ్‌కు

# నెల్లూరు ఎంతో అనుకూలం


ముత్తుకూరు మండలంలోని భూములను పరిశీలిస్తున్న పర్యాటక శాఖ డైరెక్టర్ హిమాన్ష్ శుక్లా

నెల్లూరుజిల్లాలో కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్ పరిధిలోని వివిధ పరిశ్రమల స్థాపనకు 10వేల ఎకరాల భూమిని సేకరించామని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు తెలిపారు. సోమవారం కలెక్టర్ పర్యాటక శాఖ డైరెక్టర్ హిమాన్ష్ శుక్లాతో కలసి ముత్తుకూరు, చిల్లకూరు మండలాలలో పలు భూములను పరిశీలించారు. కోస్టల్ జోన్ స్థాపనకు ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పోటీపడుతున్నాయని, ఈ ప్రాజెక్ట్‌ను దక్కించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ తెలిపారు. మొత్తం 26వేల ఎకరాల భూమిని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకొని 16వేల ఎకరాలు వివిధ సంస్థలకు కేటాయిస్తున్నామని ఆయన అన్నారు. కృష్ణపట్నం ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్‌కు 4731 ఎకరాలు, కృష్ణపట్నం పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ 1033 ఎకరాలు, కినేటపవర్ లిమిటెడ్‌కు 840 ఎకరాలు, కోస్టల్ ఆంధ్ర పవర్ లిమిటెడ్‌కు 2411 ఎకరాలు, కృష్ణపట్నం ఇంటర్నేషనల్ లెదర్ కాంప్లెక్సు 530 ఎకరాలు, ఏ.పి. పోర్టు డిపార్ట్‌మెంట్ ల్యాండ్‌కు 6800 ఎకరాలు కేటాయించాలని ప్రతిపాదించినట్లు కలెక్టర్ తెలిపారు. పర్యాటకశాఖ డైరెక్టర్ హిమాన్ష్ శుక్లా మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనల వల్ల ఉద్యోగావకాశాలు పెరుగుతాయని, దీనిపై పబ్లిక్ అవేర్‌నెస్ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నెల్లూరుజిల్లాలో ప్రభుత్వ భూములు, ఎక్కువగా వుండడం, సముద్ర తీరం కూడా ఎక్కువగా ఉండటం వల్ల పరిశ్రమల స్థాపనకు ఎక్కువగా అవకాశాలు వున్నాయని తెలిపారు. పరిశ్రమల వల్ల పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందుతుందని, అందుకు తగినట్లు డిపిఆర్‌లు తయారు చేశామని వివరించారు.

# పంతులు విగ్రహాన్ని పక్కన పెట్టారు


నెల్లూరు మద్రాసుబస్టాండ్ ప్రాంతంలో వున్న ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు విగ్రహాన్ని తొలగించారు. ఈ విగ్రహం వున్న ఐలాండ్‌ను తగ్గించి రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఈ విగ్రహం 35ఏళ్ల క్రితందని, దీని స్థానంలో 3లక్షలు ఖర్చు చేసి కొత్త విగ్రహం పెడతామని మేయర్ అజీజ్ చెప్పాడు. ఇంతవరకు బాగానే వుంది. ట్రాఫిక్‌కు అవరోధంగా వున్న మిగతా విగ్రహాలు, మిగతా ఐలాండ్‌లపై కూడా మేయర్ గారు దృష్టి పెట్టాల్సివుంది.

# శ్రీసిటీలో 'రెడ్ స్టార్ ప్లాస్టిక్'

శ్రీసిటీలో నూతనంగా రూపుదిద్దుకున్న పీవీసీ ఎడ్జ్ బాండింగ్ టేపులు తయారు చేసే రెడ్ స్టార్ ప్లాస్టిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను కరూర్ వైశ్యా బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పరమేశ్వరన్ ముఖ్య అతిథిగా విచ్చేసి జనవరి 28న ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ కనిష్క కార్తికేయన్ మాట్లాడుతూ, గత 8 సంవత్సరాల నుంచి తమ మాతృసంస్థ పీవీసీ ఎడ్జ్ టేపులు తయారుచేస్తోందని, ఇండియాలో 30 శాతం మార్కెట్ షేర్ తాము కలిగివున్నామన్నారు. తమ సంస్థ విస్తరణలో భాగంగా "రెడ్ స్టార్ ప్లాస్టిక్" పేరుతో మరో కంపెనీని ఇక్కడ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా, సులభతర వ్యాపార నిర్వహణ అంశాలతో పాటు శ్రీసిటీలో వసతులు, యాజమాన్యం సహకారం తాము ఇక్కడ పరిశ్రమ ఏర్పాటుకు ప్రధాన కారణాలుగా తెలిపారు. మొదటిదశలో 10 కోట్ల పెట్టుబడితో ప్రారంభమైన ఈ కంపెనీలో సుమారు 100 మందికి ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. శ్రీసిటీలో మరో కంపెనీ ఉత్పత్తులు ప్రారంభించినందుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ ఈ కంపెనీ ఉత్పత్తులకు మంచి డిమాండ్ వుందని, ప్రస్తుత యూనిట్ ద్వారా దేశ విదేశాలలో కంపెనీ మార్కెట్ షేర్ మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


కంపెనీని ప్రారంభిస్తున్న కరూర్ వైశ్యా బ్యాంక్ ఏజిఎం పరమేశ్వరన్

# హరిత రసాయన పద్ధతుల్లో కాలుష్యానికి చెక్



డాక్టర్ రాఘవరావును సత్కరిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

హరిత రసాయన శాస్త్ర పద్ధతులను ఉపయోగించి చర్మ పరిశ్రమలో కాలుష్యాన్ని నివారించవచ్చని చెన్నై కేంద్రీయ చర్మ పరిశోధనా సంస్థ(సిఎల్ఆర్ఐ) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ జె.రాఘవరావు పేర్కొన్నారు. నెల్లూరు విఆర్ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఎస్.ఎ.రామమూర్తి, డాక్టర్ సి.రమేష్‌కుమార్ స్మారక ఉపన్యాస కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న ఆయన చర్మ తయారీలో విజ్ఞాన శాస్త్ర భావనలు అనే అంశంపై ఉపన్యసించారు. వివిధ పద్ధతుల ద్వారా జంతు చర్మాలను శుద్ధి చేసి పాదరక్షలు, వస్త్రాలు, బెల్ట్‌లు మొదలైనవి తయారు చేసేందుకు వినియోగిస్తున్నారని, ఈ పద్ధతులవల్ల ఎక్కువ కాలుష్యం జరుగుతుందన్నారు. హరిత రసాయన శాస్త్ర పద్ధతులనుపయోగించి కాలుష్యాన్ని నివారించడమే గాక చర్మ పరిశ్రమను లాభదాయకంగానూ, సహజహితంగానూ మార్చవచ్చన్నారు. విఆర్ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి.వి.ఎస్.భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల సిఇఓ పి.సుధాకర్‌రెడ్డి, ఫిజిక్స్ హెడ్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు డాక్టర్ జి.కృష్ణకిషోర్, వి.వి.కృష్ణశర్మ, బి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాఘవరావును శాలువ, జ్ఞాపికతో నిర్వాహకులు సత్కరించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# జిల్లా అభివృద్ధికి విశేష కృషి

**- గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు**



జాతీయ పతాకానికి అభివాదం చేస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్పీ రామకృష్ణ, జేసీ ఇంతియాజ్

నెల్లూరుజిల్లాను అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నిలిపేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు పేర్కొన్నారు. జనవరి 26వ తేదీ 69వ గణతంత్ర దినోత్సవాన్ని నెల్లూరు పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్కరించి పోలీసు గౌరవవందనం స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ భాషాబేధాలు, కులమత భేదాలు లేకుండా భిన్నత్వంలో ఏకత్వం కలిగిన పరమత సహనానికి మన దేశం చక్కని ఉదాహరణ అని పేర్కొన్నారు. జిల్లాలో రాబోవు రోజుల్లో అధికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. దామవరం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ పూర్తి కావచ్చిందన్నారు. జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ, జేసి ఇంతియాజ్‌అహ్మద్, జేసీ–2 వెంకటసుబ్బారెడ్డి, నెల్లూరు ఆర్డీఓ హరిత, కలెక్టరేట్ ఏ.ఓ మధుసూదనశర్మ పాల్గొన్నారు.

**నగర పాలక సంస్థ కార్యాలయంలో...** అమరవీరుల త్యాగం మరువలేనిదని నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అలీంబాషాతో కలిసి జెండాను ఆవిష్కరించారు. అడిషనల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, ఎస్.ఇ రవికృష్ణంరాజు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

**ఆర్డీఓ కార్యాలయంలో...** నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ హరిత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నరసింహులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

**డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో...** డిఎంహెచ్‌ఓ వరసుందరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. డిఎల్‌ఓ రమాదేవి, డిఎంఓ వేణుగోపాల్, కార్యాలయ పరిపాలనాధికారి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా కోర్టు ఆవరణంలో...** జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అదనపు జిల్లా జడ్జిలు శ్యామలాదేవి, మహమ్మద్ అబ్దుల్ రఫి, శ్రీదేవి, శ్రీనివాసరావు, సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

**నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకులో...** బ్యాంక్ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి జెండా వందనం చేశారు. సిఇఓ వై.సరిత, ఏజిఎం, డిజిఎం, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో....** జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ రామకృష్ణ, పోలీసు కార్యాలయంలో ఏఎస్పి బి.శరత్‌బాబు, ఏసిబి కార్యాలయంలో ఏసిబి డిఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో డిప్యూటి కమిషనర్ టి.శ్రీనివాసరావు, జిల్లా కేంద్ర కారాగారంలో సూపరింటెండెంట్ ఎంఆర్ రవికిరణ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

**ఏ.సి సుబ్బారెడ్డి స్టేడియంలో...** ఫ్రెండ్స్‌వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల బాలికలకు వాకర్స్ జాతీయ పతాకాలను అందజేశారు. పౌల్ట్రీ పితామహుడు బి.వి.రావు వర్ధంతిని పురస్కరించుకుని వాకర్స్‌కు కోడిగుడ్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నలుబోలు బలరామయ్యనాయుడు, వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు, బి.మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.




ఇటీవల అమెరికాలో జరిగిన గవర్నర్స్ ట్రైనింగ్ కార్యక్రమంలో రోటరీ ఇంటర్‌నేషనల్ అధ్యక్షులు బ్యారీ రాశిన్ మరియు వారి సతీమణి సిసాన్‌డిమోగోలను కలిసిన డిస్ట్రిక్ట్‌గవర్నర్-3160(2018-19) కె.మునిగిరీష్ మరియు ఆయన సతీమణి అనిత.

# జగన్ వెంటే జనం

## గూడూరులో ప్రజాసంకల్పయాత్ర సక్సెస్



గూడూరు సభలో మాట్లాడుతున్న వైయస్సార్సీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి

వైయస్సార్సీపీ అధ్యక్షుడు వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ఆదివారం తిమ్మసముద్రం క్రాస్ నుంచి ప్రారంభమై కొండాగుంట, పాలిచర్ల, గాంధీనగర్, ఇందిరమ్మ కాలనీ మీదుగా గూడూరు కోర్టు సెంటర్ వరకు సాగింది. గూడూరు కోర్టు సెంటర్లో నిర్వహించిన బహిరంగ సభకు అశేష ప్రజానీకం హాజరయ్యారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని శ్రద్ధగా వింటూనే 'జై జగన్... కాబోయే సీఎం జగన్' అంటూ నినాదాలు చేశారు. జననేత జగన్ ప్రసంగిస్తూ సీఎం చంద్రబాబు చేసిన మోసాలపై అడిగిన ప్రశ్నలకు ఉత్సాహంగా జవాబులు చెప్పారు. కోర్టు సెంటర్లోనే కాకుండా రెండు వైపులా ఉన్న రోడ్లపై జనాలు కిక్కిరిసిపోయారు. గూడూరు నియోజకవర్గంలోని తిమ్మసముద్రం క్రాస్‌రోడ్డు ప్రాంతం నుండి ఆదివారం ప్రజాసంకల్పయాత్ర ప్రారంభమైంది. అప్పటికే ఆ ప్రాంతానికి చెందిన బండి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లుతో పాటు కాంగ్రెస్‌పార్టీని వీడిన మరికొందరు వైయస్సార్సీపీలో చేరారు. అనంతరం అక్కడ నిమ్మ రైతులు గిట్టుబాటు ధరలు లేవంటూ కంటతడి పెడుతూ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆ ప్రాంతం మంచి జననేతకు నీరాజనాలు పలుకుతూ పూలబాట వేస్తూ ఘనస్వాగతం పలికారు.

ఆదివారం సాయంత్రం గూడూరు కోర్టు సెంటర్‌లో జరిగిన సభలో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దుగరాజపట్నం పోర్టు ఈ ఏడాదికి పూర్తి చేయాల్సి వున్నా తెలుగుదేశంకు చిత్తశుద్ధి లేకపోవడం, విభజన సమయంలో పోర్టు ఏర్పాటుకు ఆమోదం తెలిపినా అతీగతీ లేక చంద్రగ్రహణం పట్టిందని విమర్శించారు. గూడూరు నియోజకవర్గ సమస్యలపై మాట్లాడారు. మాజీ సీఎం రాజశేఖరరెడ్డి హయాంలో కృష్ణపట్నం పోర్టును ఏర్పాటు చేశారన్నారు. రాజశేఖరరెడ్డి పాలనలో 64కోట్లు వెచ్చించి గూడూరు పురపాలక సంఘంలోని జలాలకు ఖర్చుపెడితే చుక్క నీరు ఇవ్వలేకపోవడం, గూడూరు పట్టణంలో అసంపూర్తిగా వున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి చూస్తే దీవిపాలెం పంచాయతీ ప్రాంతంలో నిర్మిస్తున్న ఇళ్ళ నిర్మాణంలో జరుగుతున్న తంతు గురించి తెలిస్తే చంద్రబాబు నాయుడు పాలనకు నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. గూడూరు ప్రాంతంలో విస్తారంగా నిమ్మసాగును చేపడుతున్నా ప్రస్తుతం ధరలు లేక నిమ్మరైతులు నష్టాలలో పడుతున్నారన్నారు.

## కమిషనర్ బదిలీ



చంద్రశేఖర్‌రెడ్డి

గూడూరు పురపాలక సంఘ కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి బదిలీపై నాయుడుపేటకు వెళ్ళారు. ఆయన స్థానంలో వెంకటగిరి పురపాలక సంఘ కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్ నియమితులయ్యారు. సోమవారం ఉత్తర్వులు పురపాలక సంఘం కార్యాలయానికి అందాయి.

కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఇక్కడ పనిచేసిన రెండేళ్ళలో స్వచ్ఛభారత్ అమలులో అవార్డు పొందారు. పరిశుభ్రతలో ప్రత్యేకశ్రద్ధ, డంపింగ్‌యార్డ్, గ్రీనరీ పెంపుదల, పన్నుల వసూళ్ళలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు



## వైస్సార్సీపీలోకి మీరారెడ్డి దంపతులు

గూడూరు పట్టణానికి చెందిన యువనాయకుడు, మాజీముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి వీరాభిమాని కోడూరు మీరారెడ్డి ఆయన సతీమణి, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ కోడూరు కల్పలతలు వందలాదిమంది కార్యకర్తలతో గూడూరు సిరామిక్ కళాశాల వద్దగల ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వైయస్సార్సీపీలో చేరారు. వైయస్సార్సీపీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి మీరారెడ్డి దంపతులను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించాడు. గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేరిగ మురళి, ఆ పార్టీ నాయకులు బత్తిని విజయకుమార్, శాకిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా పట్టణానికి చెందిన చేగువెరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండ్ల సురేష్‌బాబు, అతని సతీమణి గీత ఆధ్వర్యంలో వందలమంది యువకులు పార్టీలో చేరారు.

## 'సింహగర్జన'ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



గూడూరు ఆర్ అండ్ బి అతిథి గృహం ఆవరణంలో సింహగర్జన పేపర్‌ను గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఇటీవల ఆవిష్కరించాడు. ఈ కార్యక్రమంలో చేవూరు విజయమోహన్‌రెడ్డి, మనపాటి రవీంద్ర, పులిమి శ్రీనివాసులు, గోను శివకుమార్, నవీన్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు. సింహగర్జన ఎడిటర్ షేక్ గౌస్‌బాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

నిలబడిపోయిన సమస్యలు కొన్ని పరిష్కారమై, చేస్తున్న పనులు నిదానంగా సాగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. మీ వల్ల కొన్ని ఇబ్బందులు కుటుంబసభ్యులకు కలుగవచ్చును. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా ఉండి ఆశించిన ఆదాయము తగ్గుతుంది. శుభకార్య ప్రయత్నాలు, ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంది. కుటుంబసౌఖ్యం బాగున్నది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆలోచనలు కార్యరూపం దాల్చి బంధుమిత్రుల సహకారం బాగుంటుంది. కొత్త పరిచయాలు ఏర్పడి మీకు మేలు జరుగుతుంది. ఆర్థికంగా బాగుండి పెట్టుబడికి అవకాశాలు, కొత్త వ్యాపారావకాశాలుండగలవు. వృత్తులలో గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. రావలసిన బాకీలు లభించగలవు. నిలబడిపోయిన సమస్యలు, ఇబ్బందులు సర్దుబాటు కాగలవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

తొందరపాటు నిర్ణయాలు, చర్యలు తగ్గించుకొనండి. బంధుమిత్రులకు సహాయ పడతారు. ఒక సమాచారం ఉత్సాహాన్ని ఇవ్వగలదు. అదనంగా ఖర్చులు పైనబడినా ఇబ్బందులుండవు. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక ప్రగతి బాగుండి ఆదాయం పెరుగుతుంది. కుటుంబంలో కొద్దిపాటి అభిప్రాయభేదాలుండి సర్దుబాటు కాగలవు. విద్యార్థులు మరింత కృషి చేయాలి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

రావలసిన బాకీలు నిలబడిపోతాయి. ఆదాయానికి తగినట్లు ఖర్చులుంటాయి. వ్యవహారాలలో తొందరపాటు, కటువుగా మాటలు లేకుండా చూచు కొనాలి. ఉదరకోశ సంబంధ రుగ్మతులుంటాయి. దూర ప్రయాణాలు నిర్ణయం జరుగుతుంది. వృత్తి వ్యాపారాల వృద్ధి, ఆదాయవృద్ధి ఉంటుంది. పనులు సానుకూలంగా సాగుతాయి. బంధు సఖ్యత బాగుంటుంది.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 2.2.2018 నుండి
తేది. 8.2.2018 వరకు

ఈ వారము కర్కాటకంలో రాహువు, సింహ కన్య తుల వృశ్చిక రాశులలో చంద్రుడు, తులలో గురువు, వృశ్చికంలో కుజుడు, ధనుస్సులో శని, మకరంలో రవి బుధ కేతు శుక్రులు, 6తేది నుండి కుంభ రాశిలో శుక్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.
ముహూర్తములు లేవు.

**మాఘమాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 2 | శుక్ర | విదియ | సా॥ గం.3.53వ॥ |
| తేది. 3 | శని | తదియ | ప॥ గం.2.20వ॥ |
| తేది. 4 | ఆది | చతుర్థి | ప॥ గం.1.11వ॥ |
| తేది. 5 | సోమ | పంచమి | ప॥ గం.12.24వ॥ |
| తేది. 6 | మంగళ | షష్ఠి | ప॥ గం.12.15వ॥ |
| తేది. 7 | బుధ | సప్తమి | ప॥ గం.12.31వ॥ |
| తేది. 8 | గురు | అష్టమి | ప॥ గం.1.21వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. ఇంట బయట వ్యవహారాలలోను, ఆర్థిక వ్యవహారాలలోను విశ్రాంతి లేక బిజీగా ఉంటారు. బిడ్డలకు అనారోగ్య బాధలుంటాయి. శుభకార్య ప్రయత్నాలలో ముమ్మరంగా ఉంటారు. పనులు నెరవేరడానికి బాగా శ్రమ పడవలెను. అనవసర విషయాలను వదలివేయండి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

## మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

డబ్బుకు ఇబ్బందులు లేకపోయినా, ఖర్చులు పెరిగిపోతాయి. రావలసిన బాకీలు, కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. గృహ వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలను వాయిదా వేసుకొనడం మంచిది. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారు దృష్టి పెట్టండి ప్రయత్నాల మీద. సాంస్కృతిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. శుభవార్తలు వింటారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

చేపట్టిన పనుల వల్ల బాగా టెన్షన్ పడతారు. పనులు నిదానంగా జరుగుతాయి. ఆర్థికంగా బాగుండి, వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉంటుంది. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. అత్యవసర ప్రయాణాలుంటాయి. ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో సంతృప్తి ఉంటుంది. సహచరులతో, క్రింది ఉద్యోగులతో జాగ్రత్తగా మెలగాలి. ఆత్మీయులను కలుసుకొంటారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి జీవనం కలవారికి ఆదాయవృద్ధి, వ్యాపారవర్గాలకు కొత్త ఆర్థికావకాశాలు లభిస్తాయి. పెండింగ్‌లోని సమస్యలు పరిష్కారానికి రాగలవు. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు, పనిభారముంటుంది. బిడ్డలకు ఉద్యోగావకాశాలు దొరకడం, శుభకార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. నిత్య కృత్యాలైన పనులు టెన్షన్ పెడతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి వ్యాపార రంగములందు సామాన్య ప్రగతి ఆదాయము ఉంటుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. పెండింగ్‌లోనున్న వ్యవహారాలలో మార్పుండదు. అవసరాలకు డబ్బు, రావలసిన బాకీలు కొంత అందుతాయి. ఉద్యోగులు తమ అధికారులతో, జనంతో జాగ్రత్తగా మెలగండి. ఖర్చులు కొంత అదనం కాగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపార రంగాలు సామాన్యంగా జరుగుతాయి. పెద్ద అభివృద్ధి ఉండదు. అయితే డబ్బుకు ఇబ్బందులుండవు. బంధువర్గంతోను, మిత్రులతోను మనస్పర్థలు రాకుండా చూచుకొనాలి. వ్యవహారాలలో మీ సమర్థతకు గుర్తింపు ఆలస్యం కాగలదు. కొన్ని అదనపు ఖర్చులుంటాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. విద్యావృద్ధి బాగున్నది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థికంగా స్థిమితపడగలరు. వ్యాపార రంగంలో గాని, వృత్తిపరంగాగాని ముందంజ వేస్తారు. రావలసిన బాకీలు కొంతవరకు అందుతాయి. ముఖ్యఅవసరాలు జరిగిపోతూ మానసిక ఆనందం పొందుతారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులు బాధ్యతల నిర్వహణలో సంతృప్తి చెందుతారు. అనుకున్న పనులు కొద్ది టెన్షన్ పెట్టినా అనుకూలంగా జరుగుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఏ పనులనైనా ముందుచూపుతో, ప్రణాళికాబద్ధంగా జరుపుతారు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. ఆర్థికస్థితి బాగుండి వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. ఉద్యోగులకు బాధ్యతలు ఎక్కువై, గృహ వస్తువాహన రిపేర్లుంటాయి. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. కొత్త పెట్టుబడులకు వ్యాపార విస్తరణకు అనుకూలమైన కాలం.

# రిపబ్లిక్ పరేడ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నెల్లూరు టెర్రర్స్

శ్రీను గల్పిక

ఢిల్లీలోని ఎర్రకోట మైదానం. రిపబ్లిక్‌డే వేడుకలు మొదలు కాబోతున్నాయి. అతిథులందరూ చేరుకుంటున్నారు. అలవాటులో పొరపాటుగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విఐపి బ్లాక్‌లో మొదటి వరుస కుర్చీలలో కూర్చున్నాడు. అంతలో ప్రధాని నరేంద్ర మోడీతో పాటు ఆసియాన్ దేశాలైన సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, థాయ్‌లాండ్, మయన్మార్, తదితర దేశాల అధినేతలు వచ్చారు. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వెంటనే రాహుల్ వద్దకొచ్చి... సార్, ఈ వరుస ఆసియాన్ దేశాల ప్రతినిధులకు కేటాయించాం, వాళ్ళను గౌరవించడం మన ధర్మం, మీరు వెనుక వరుసలో కూర్చోండి అని చెప్పాడు. రాహుల్ ఏమీ మాట్లాడకుండా రెండో వరుసలో కూర్చున్నాడు. కొద్దిసేపటికి మాజీప్రధానులు, మాజీ ఉపరాష్ట్రపతులు, మాజీప్రధాన న్యాయమూర్తులు వచ్చారు. రాజ్‌నాథ్‌సింగ్ రాహుల్ వద్దకెళ్ళి సీనియర్లను గౌరవించడం మన ధర్మం, మీరు మూడో వరుసలో కూర్చోమన్నాడు. రాహుల్ అలాగే చేసాడు. కొద్దిసేపటికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి, చీఫ్ విజిలెన్స్ కమిషనర్ తదితరులొచ్చారు. రాజ్‌నాథ్‌సింగ్ రాహుల్ వద్దకు వస్తుండగా ఆయనే లేచి... మీకేం శ్రమక్కరలేదు, నేను వెళ్ళి చివర వరుసలో కూర్చుంటాను. అక్కడకూడా ఎవరన్నా వున్నారంటే చెప్పండి విజిటర్స్ గ్యాలరీలోకి వెళ్ళి కూర్చుంటానన్నాడు. ఇప్పుడు కరెక్ట్‌గా లైన్‌లోకి వచ్చారు. చివరి వరుసలో మాకెటువంటి ఇబ్బంది లేదు. అక్కడ నుండి మిమ్మల్ని లేపం, కావాలంటే రాసిస్తాను అని రాజ్‌నాథ్ హామీ ఇచ్చాడు. దాంతో రాహుల్ వెళ్ళి చివరి వరుసలో కూర్చున్నాడు. అంతలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వచ్చారు. సైనిక గౌరవవందనాల మధ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఆసియాన్ దేశాల ప్రతినిధులు ఆ వేడుకలను తిలకిస్తూనే తలలు అటు ఇటు తిప్పుతూ ఎవరి కోసమో చూడసాగారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం... సైనిక పాటవ ప్రదర్శన మొదలైంది. ఒకే బైక్ మీద 30మంది మహిళా సైనికుల విన్యాసం, అగ్ని, పృథ్వి క్షిపణుల ప్రదర్శన, యుద్ధ విమానాలు, యుద్ధ ట్యాంకుల ప్రదర్శన, ఎన్ఎస్‌జి కమాండోల ప్రదర్శన, వైమానిక దళ ప్రదర్శన, ఇలా ఒక్కొక్కటిగా సాగాయి. అన్నింటిని చూసి ఆసియాన్ దేశాల ప్రతినిధులు చప్పట్లుకొట్టారు. అలా కొడుతూ కూడా వాళ్ళు తలలు అటు ఇటూ తిప్పుతూ ఎవరి కోసమో చూడసాగారు. మోడీ దానిని గమనించాడు. అయినా ఎందుకోలే అని ఊరుకున్నాడు. అంతలో మైక్ అనౌన్స్‌మెంట్... మీరు ఇంతవరకు చూసిన సైనిక విన్యాసాలు, ఆయుధ సంపత్తి ఒక ఎత్తు... ఇప్పుడు చూడబోయే భారత జీవాయుధ దళం శక్తి సామర్థ్యాలు మరోఎత్తు. కళ్ళార్పకుండా చూడండి... ఒక్క క్షణం కన్నార్పినా ఒక అద్భుతాన్ని మిస్ అవుతారు. రెడీ వన్... టూ... త్రీ అనగానే అందరి కళ్ళ ముందు నుండి 'జుమ్' అంటూ పెద్ద సౌండ్‌తో రాకెట్ కన్నా వేగంతో గాల్లోనే ఒక దళం దూసుకుపోయింది. అది ఏమైందో ఎవరికీ అర్థం కాలేదు. ఆసియాన్ దేశాల ప్రతినిధులకైతే తల తిరిగినంత పనైంది. తమ కళ్ళముందే అరసెకండ్ కూడా కనిపించకుండా పోయిన ఆ దళం ఏంటి? ఇంత శక్తివంతమైన దళం శత్రుదేశాల మీద దాడి చేస్తే ఇంకేమైనా ఉందా? అసలు ఈ దళం కథా కమామిషు ఏంటి? తెలుసుకోవాలనుకున్నారు. ఆ విషయాన్నే మోడీని అడిగారు. దానికాయన బదులిస్తూ... ఈ దళాన్ని మేము ఐఆర్ 20-420 నెల్లూరు టెర్రర్స్‌గా పిలుస్తాం. ఇవి భూమ్మీద రాక్షస బల్లులు తిరిగిన కాలం నాటి దోమలు. అప్పట్లో రాక్షసబల్లులు అంతరించిపోవడానికి ఈ దోమలే కారణమని జీవశాస్త్ర నిపుణులు తమ పరిశోధనలలో తేల్చారు. అంతరించిపోయిన ఇలాంటి జీవరాశి ఆచూకీ మళ్ళీ నెల్లూరు నగరంలో లభించింది. అక్కడి కార్పొరేషన్ పుణ్యమా అని ఈ జీవరాశిని అభివృద్ధి చేసి మేము ఒక దళంగా ట్రైనింగ్ ఇచ్చాం. ఈ దళాన్ని ఏ దేశం మీదకు వదిలినా సరే... ఏడాదిలో ఆ దేశాన్ని నాశనం చేయగలవు. ఆ దేశ ప్రజలు నిత్యం రోగాలతో ఛస్తూ బ్రతకాల్సిందే అని చెప్పాడు. మరి ఇంత శక్తివంతమైన దళాన్ని పెట్టుకుని మీరు చైనా, పాకిస్థాన్‌లను ఎందుకు ఉపేక్షిస్తున్నారని సింగపూర్ ప్రధాని లీ సెన్ లూంగ్ అడిగాడు. దానికి మోడీ... మేం అహింసావాదులం, మహాత్ముడు, గౌతమబుద్ధుడి వారసులం. అందుకే జాలి, దయతో వారిని వదిలేస్తున్నాం. అది సరేగాని మీరు చాలాసేపటి నుండి అటు ఇటు చూస్తున్నారు, ఎవరి కోసం అని అడిగాడు. దానికి మలేషియా ప్రధాని నజీబ్ రజాక్ వుండి... చంద్రబాబు గారి కోసం. ఆయన అమరావతి పేరుతో మూడేళ్ళలోనే అద్భుత నగరాన్ని నిర్మించాడట కదా! ఆయన ఇక్కడకు వస్తాడేమో, ఆయనతో పాటు వెళ్ళి అమరావతిని చూడాలనుకుంటున్నామని చెప్పాడు. అప్పుడే అక్కడకు వచ్చిన అమిత్‌షా... ఓహో! అమరావతి టీజర్ మీక్కూడా చూపించాడన్నమాట. మేం నాలుగేళ్ళ నుండి ఆ టీజర్‌నే చూస్తున్నాం, టీజర్ తప్ప అక్కడ సినిమా లేదు. ఇదిగో ఈ సి.డి తీసుకెళ్ళి చూసుకోండి... అమరావతి అంతా దీనిలో వుందని చెప్పాడు. ఈ సిడిలో ఏముందని థాయ్‌లాండ్ ప్రధాని ప్రయూత్ చాన్ ఓ చా అడిగాడు. ఈ సి.డిలోనే అమరావతి రాజధాని గ్రాఫిక్స్ వున్నాయని చెప్పి అమిత్‌షా అక్కడనుండి వెళ్ళిపోయాడు.

# దొడ్డోళ్ళది దొడ్డ మనసు

## - రాష్ట్ర మంత్రులు

పొదలకూరు మండలం, మహమ్మదాపురంలోని దొడ్ల శేషారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జూనియర్ కాలేజీగా అభివృద్ధి చేసేందుకై ప్రభుత్వంతో చర్చించి తగు చర్య తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఇన్‌ఛార్జ్ మరియు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. జనవరి 27న పొదలకూరు మండలం, మహమ్మదాపురం దొడ్ల శేషారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను సిఎస్‌ఆర్ నిధుల ద్వారా 70కోట్ల 75వేల నిధులతో పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొని మంత్రి మాట్లాడుతూ 1959లో కేవలం ఒకటిన్నర లక్షల రూపాయలతో ఎంతో ముందుచూపు అవగాహనతో స్కూలు భవంతిని నిర్మించడం గొప్ప విషయమని, దాని మరమ్మత్తులకు దొడ్ల శేషారెడ్డి మనమడు శేషారెడ్డి 70లక్షలపైన వెచ్చించడం ద్వారా ఈ ప్రాంతవాసుల విద్యాభివృద్ధికై ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని, వారికి ఈ ప్రాంత వాసులు సదా రుణపడి వుండాలన్నారు.



సభలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా।। పొంగూరు నారాయణ మాట్లాడుతూ చదువుకి మంచి వాతావరణం, మౌలిక వసతులు ముఖ్యమని, ఇక్కడ అటువంటి వాతావరణం వుండడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని, అందుకోసం బడ్జెట్‌లో 22వేల కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. డిజిటల్ ఎడ్యుకేషన్ ఏర్పాట్లలో భాగంగా 6,000స్కూళ్లలో టెండర్లను పిలవడం జరిగిందని, 1000 స్కూల్స్‌కు హార్డ్‌వేర్లు అందజేయడం జరుగుతుందన్నారు. జూన్ నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌రూంలు ఏర్పాటు చేయడంతో పాటు అత్యున్నత నాణ్యత గల విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు.

రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ డబ్బులున్న ప్రతివాళ్ళు సేవ చేయవలసిన అవసరం లేదని అటువంటిది దొడ్ల వంశీయులు జిల్లాలో విద్య, వైద్యంపై మక్కువతో హాస్పిటల్స్, పాఠశాలలు నిర్మించి సేవ చేయడం అభినందనీయమన్నారు. అన్ని వసతులతో పాఠశాల నిర్మించి అప్పట్లోనే భావితరాలను దృష్టిలో వుంచుకొని నిర్మించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం, బీద రవిచంద్ర, జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, ఆర్‌డిఓ డి.హరిత, జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్, సర్వశిక్ష అభియాన్ పి.ఓ విశ్వనాథ్, దొడ్ల శేషారెడ్డి, సుబ్బారెడ్డి, సునీల్‌రెడ్డి, శిల్పారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దొడ్ల శేషారెడ్డి అధ్యక్షత వహించగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదిశేషారెడ్డి పాఠశాల ప్రగతిని చదివి వినిపించారు.

# ఎల్‌ఎపి స్కూల్ 33వ వార్షికోత్సవం



వార్షికోత్సవ వేడుకల్లో గీతాలాపన చేస్తున్న విద్యార్థినులు

గూడూరులోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ 33వ వార్షికోత్సవం గత నెల 30వ తేదీ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వీరయ్య పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్లు శ్రీకాంత్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, పిటిఎ సెక్రటరి దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ నమఃశివాయం, హెడ్‌మాస్టర్ పి.టి.జాయ్ పాల్గొన్నారు.

# ‘ఆనాటి ఉదయగిరి దుర్గం కథలు’ పుస్తకావిష్కరణ

నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో గత నెల 30న విశ్రాంత తహశీల్దార్ పోట్లూరు సుబ్రహ్మణ్యం రచించిన “ఆనాటి ఉదయగిరి దుర్గం కథలు” పుస్తకాన్ని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పోట్లూరు సుబ్రహ్మణ్యం, వాకర్స్ అంతర్జాతీయ సంస్థ ఏరియా-2 సమన్వయకర్త యం.వి.సుబ్బారెడ్డి, మాజీ జిల్లా గవర్నర్ మైథిలి మనోహర్‌రెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి కొండూరు సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బలరామయ్యనాయుడు



# శ్రీకాళహస్తి న్యూస్

## 8 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మహాశివరాత్రి ఆహ్వానపత్రికను అందజేస్తున్న శ్రీకాళహస్తీశ్వరాలయ ఇ.ఓ డి.భ్రమరాంబ

దక్షిణకాశిగా ప్రసిద్ధిగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఫిబ్రవరి 8వ తేది నుంచి 20వ తేది వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.భ్రమరాంబ తెలియజేశారు. ఎంతో విశిష్టమైన ఈ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావును ఆహ్వానించామన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ తేదిన భక్తకన్నప్ప ధ్వజారోహణం, 9వ తేదిన శ్రీస్వామి వారి ధ్వజారోహణం(దేవరాత్రి) నిర్వహిస్తామన్నారు. 10న రెండవ తిరునాళ్ళు (భూత రాత్రి), 11న రావణాసుర-మయూర వాహనసేవలు (గాంధర్వ రాత్రి), 12న నాల్గవ తిరునాళ్ళు (నాగరాత్రి) నిర్వహిస్తామన్నారు. 13న మహాశివరాత్రి ఉత్సవాన్ని ఎంతో నేత్రపర్వంగా నిర్వహిస్తామన్నారు. 14న ఉదయం రథోత్సవం, రాత్రికి తెప్పోత్సవం (బ్రహ్మరాత్రి) నిర్వహిస్తామని, 15న కల్యాణోత్సవం (స్కంధరాత్రి), 16న సభాపతి కల్యాణం, 17న కైలాసగిరి ప్రదక్షిణం, 18వ తేదిన తీర్థవాది(ధ్వజావరోహణం) నిర్వహిస్తామన్నారు. 19న పల్లకీసేవ, 20న ఏకాంత సేవతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పటిష్టవంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి తగు సూచనలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అర్బన్ ఎస్‌పి అభిషేక్ మహంతి, ఆలయ ఇ.ఇ వెంకటనారాయణ, ఏఎస్పీ స్వామి, మురళీకృష్ణ, డిఎస్పీ వెంకటకిషోర్, సిఐ సత్యనారాయణ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో గణతంత్ర వేడుకలు



జాతీయపతాకానికి వందనం చేస్తున్న బిజెపి నాయకులు కోలా ఆనంద్, తదితర నాయకులు

శ్రీకాళహస్తిలో గతనెల 26న భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పలు ఉద్యోగసంఘాల నాయకులు, పలు శాఖల వారు, నాయకులు అందరూ రిపబ్లిక్ దినోత్సవాన్ని వేడుకగా జరుపుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారిణి డి.భ్రమరాంబ పతాకావిష్కరణ చేయగా, ఉద్యోగులు వందనం చేశారు. బేరివారి మండపం వద్ద బిజెపి నాయకులు కోలా ఆనందకుమార్ పతాకావిష్కరణ చేయగా, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గరికపాటి రమేష్‌బాబు, పగడాల రాజు, కౌన్సిలర్ ముత్తు తదితరులు జాతీయపతాకానికి గౌరవ వందనం చేశారు. ఆర్టీసి బస్టాండ్ సర్కిల్ వద్ద అంబేద్కర్ దళిత విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేద్కర్‌కు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు వై.జయరామయ్య, ప్రధాన కార్యదర్శి జయచంద్రరావు, కార్యదర్శి పనబాక వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, పెంచలయ్య, ఉపకార్యదర్శి సిద్ధయ్య పాల్గొన్నారు. నవభారత్ యువజన సంఘం నాయకులు గరికపాటి రమేష్‌బాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, సంఘం నాయకులు వందనం చేశారు.



నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 26వ తేదీ జరిగిన రిపబ్లిక్‌డే కార్యక్రమంలో పోలీసు శాఖలో చేస్తున్న ఉత్తమ సేవలకు గాను జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్పీ రామకృష్ణ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని తీసుకొంటున్న గూడూరు పోలీసుశాఖకు చెందిన ఆర్.వెంకటేశ్వరరాజు



గత నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో రంగస్థల కళాకారునిగా విశేష సేవలు అందించిన ప్రముఖ రంగస్థల కళాకారుడు ‘నటభాస్కర’ వల్లకవి వేంకట సుబ్బారావును సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, జేసి ఇంతియాజ్ అహ్మద్, ఆర్‌డిఓ శ్రీమతి హరిత తదితరులు

# ప్రీ పిహెచ్‌డి పరీక్షలు వాయిదా వేయాలి



రిజిస్ట్రార్ చంద్రయ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న బి.సి విద్యార్థి మహాసభ సభ్యులు

నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో ప్రీ పిహెచ్‌డి పరీక్షలను వాయిదా వేయాలంటూ గత నెల 30న యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.చంద్రయ్యకు వినతిపత్రం అందజేసినట్లు ఆంధ్రప్రదేశ్ బి.సి విద్యార్థి మహాసభ జిల్లా అధ్యక్షుడు నరేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ విక్రమ సింహపురి యూనివర్సిటీలో పిహెచ్‌డి అభ్యసిస్తున్న విద్యార్థులకు ఇప్పటివరకు రీసెర్చ్ మెథడాలజీ తరగతులు నిర్వహించకుండా ప్రీ పిహెచ్‌డి పరీక్షలను జరపాలని వర్సిటీ అధికారులు చూడడం దారుణమన్నారు. తక్షణమే ఈ విషయంపై సమీక్షించి పూర్తిస్థాయి విచారణ జరిపి విద్యార్థులు ఎవ్వరూ నష్టపోకుండా రీసెర్చ్ మెథడాలజీ తరగతులు నిర్వహించి పరీక్షలను జరపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకుంటే అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకుని ఉద్యమ బాట పడుతామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శ్రీహరి, వెంకటకృష్ణ, రామకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జయప్రకాష్‌కు విశిష్ట పురస్కారం




జయప్రకాష్‌కు అవార్డును అందజేస్తున్న భూమా బ్రహ్మానందరెడ్డి, ఇంతియాజ్ అహ్మద్

గత మూడు దశాబ్దాలుగా స్వయం ఉపాధి రంగంపై యువతకు అవగాహన కల్పిస్తుండడంతో పాటు, పాత్రికేయ రంగంలో ఉత్తమ సేవలందిస్తున్న ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్‌కు ఇటీవల కర్నూలుజిల్లా నంద్యాలలో జరిగిన కార్యక్రమంలో విశిష్ట పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. నేషనల్ బిసి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులకు అందజేసే ప్రతిష్టాత్మకమైన మహాత్మా జ్యోతిరావుపూలే, భారతరత్న డా.బిఆర్ అంబేద్కర్ పేరుతో 'సేవా రత్న' అవార్డులను ఈసారి నెల్లూరు జిల్లా నుంచి ఏ.జయప్రకాష్ ఎంపిక య్యారు. అసోసియేషన్ ఛైర్మెన్ డాక్టర్ భక్తుల సంజీవరాయుడు, ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, విద్యావేత్త ఇంతియాజ్ అహ్మద్ తదితరులు జయప్రకాష్‌కు ఈ అవార్డును బహూకరించారు.

# చంద్రగ్రహణంతో ఆలయాలు మూత



చంద్రగ్రహణం కారణంగా నెల్లూరుజిల్లాలోని ఆలయాలను గత నెల 31న మూసివేశారు. ఉదయం 11గంటలకు ఆలయాలను మూసివేశారు. చంద్రగ్రహణం సాయంత్రం 5.18గంటల నుండి రాత్రి 8.44గంటల వరకు కొనసాగింది. చంద్రగ్రహణం పూర్తైన తర్వాత ఆలయాల సంప్రోక్షణ, శుద్ధి అనంతరం ఈ నెల 1వ తేదీ ఉదయం యధావిధిగా ఆరుగంటలకు ఆలయాలను తెరిచారు.

# యోగ గురువులకు అవార్డులు



యోగోత్సవం-2018 సందర్భంగా ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్ర యోగ గురువులకు గత నెల 27న బెంగుళూరులోని వర్తుర వివిఎం యోగ కేంద్రంలో జరిగిన 108 సూర్య నమస్కారాల పోటీలో నెల్లూరుకు చెందిన యోగ మాస్టార్లు ప్రసన్నకుమార్, స్వప్నలు ప్రతిభతో రాణించి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 'యోగ రత్న' అవార్డులను అందుకున్నారు. వివిఎం సంస్థ నిర్వాహకుడు గణేష్ గురూజీ చేతుల మీదుగా వారు అవార్డును అందుకున్నారు. సూర్యనమస్కారాలు ప్రతిరోజు చేయడం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. యోగ రత్న అవార్డులను సాధించిన నెల్లూరు యోగ మాస్టార్లను జిల్లా యోగ క్రీడా అసోసియేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి అభినందించారు.

# బాబు భజనసేన

(మొదటి పేజీ తరువాయి)

అసలు అతను ఏం చేస్తున్నాడు? ఏ లక్ష్యంతో చేస్తున్నాడు? ఎవరిని ఉద్దేశించి చేస్తున్నాడు? ఎవరి బాగు కోసం ఈ వింత చేష్టలు చేస్తున్నాడు? ప్రభుత్వాన్ని వదిలేసి ప్రతిపక్షం మీద అది కూడా ఒక్కరోజు కూడా అధికారంలో లేని పార్టీ మీద విమర్శలు చేయడమేంటి? పవన్‌కళ్యాణ్ వల్ల చాలామందిలో ఉత్పన్నమైన ప్రశ్నలివి. కొందరు విద్యార్థులైతే ఈ వితండ రాజకీయ జీవి మీద పరిశోధనలు కూడా చేయాలనుకుంటున్నారు.

అయితే ఆయన చేసిన అనంతపురం పర్యటనతోనే వీటిలో చాలావాటికి సమాధానం దొరికింది. తనకు ఏ పరిటాల రవి అయితే గుండు కొట్టించాడనే ప్రచారం జరుగుతుందో, అదే పరిటాల ఇంటికి వెళ్లాడు. వాళ్ళతో మంచి చెడ్డా మాట్లాడుకున్నాడు. అదేపనిలో ఫిరాయింపు ఎమ్మెల్యే చాంద్‌బాషా ఇంటికి కూడా వెళ్ళాడు. మరో టీడీపీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి ఇంటికి వెళ్ళాడు. ఇక్కడే తెలిసింది ఈయన అసలు రంగు. వెళ్ళింది ప్రజాసమస్యలు తెలుసుకోవడానికే అయితే అధికార పార్టీ నాయకుల ఇళ్ళల్లో ఏం పని. పవన్‌ది అంతా యాక్షన్... ప్యాకేజీ పథకంలో ఈ డ్రామా ఓ భాగమే!

ఇటీవల సోషల్ మీడియాలో డైవర్షన్ ఆంటీ వీడియోలు హల్‌చల్ చేస్తుండడం చూస్తూనేవున్నాం. రానాకు రావాల్సిన మరణాన్ని రామానాయుడికి డైవర్ట్ చేసానని, ఏపికి రావాల్సిన వరదలను తమిళనాడుకు డైవర్ట్ చేసానని, భారత దేశానికి రావాల్సిన తుఫాన్‌ను బంగ్లాదేశ్‌కు మళ్లించానని ఈ డైవర్షన్ ఆంటీ చెబుతుండడాన్ని చూస్తుంటాం. ఈ డైవర్షన్ ఆంటీ లాగానే ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కూడా ఒక డైవర్షన్ అంకుల్ తయారయ్యాడు. ఆయనే పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్.

ఎన్నో అంచనాలు పెట్టుకున్న 'అజ్ఞాతవాసి' సినిమా ఎత్తిపోయిందని తేలాక రాజకీయ యాత్ర మొదలుపెట్టాడు. ఆ డైవర్షన్ ఆంటీ పలు అంశాలను డైవర్ట్ చేసానని చెబుతుంటుంది. కానీ, ఈ డైవర్షన్ అంకుల్‌కు ఒకటే సబ్జెక్ట్. అదే చంద్రబాబు ప్రభుత్వం మీద వ్యతిరేకతతో వైకాపాకు వెళ్ళే ఓట్లన్నింటిని తన పార్టీకి డైవర్ట్ చేయడమే! అందుకోసమే వచ్చే ఎన్నికల్లో ఈయన పోటీ చేయబోతున్నాడు కూడా! ఇప్పుడు సడెన్‌గా తెలంగాణ, ఏపి రాష్ట్రాల్లో రాజకీయ యాత్రను మొదలుపెట్టడానికి కూడా ప్రధాన కారణం ప్రజా సంకల్ప పాదయాత్రలో జగన్‌కు వస్తున్న ప్రజాదరణను డైవర్ట్ చేయడం కోసమే!

పేరుకు ఈయన రెండు రాష్ట్రాల్లో రాజకీయ యాత్ర చేస్తానంటున్నాడు. తెలంగాణలో పవన్‌కు అంత సీన్ లేదు. అక్కడ కేసీఆర్‌కు సరెండర్ అయిపోయాడు. ఆయనను ప్రసన్నం చేసుకోబట్టే తెలంగాణలో 'అజ్ఞాతవాసి' బెనిఫిట్ షోలకు అనుమతి లభించింది. తెలంగాణలో యాత్రలు చేయాలని, అక్కడ విరగదీయాలనే కాన్సెప్ట్ కూడా పవన్‌లో లేదు.

కేవలం ఏపిలో జగన్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా పవన్ రంగంలోకి దిగాడు. ఆయన దిగాడు అనేకంటే కూడా చంద్రబాబు దించాడని చెప్పవచ్చు. జగన్ ప్రజా సంకల్ప పాదయాత్ర రాయలసీమ నాలుగు జిల్లాల్లో పూర్తయ్యింది. ఈ జిల్లాల్లో పవన్ ప్రభావం పెద్దగా వుండదు. తాజాగా నెల్లూరుజిల్లా అంటే దక్షిణ కోస్తా నుండి జగన్ యాత్ర మొదలైంది. ఇక్కడ నుండి ఉత్తరం వైపుకు వెళ్ళే కొద్ది జిల్లాల వారీగా పవన్ ప్రభావం కొంతవరకు ఉంటుంది. జగన్ గుంటూరు, కృష్ణా జిల్లాలోకి వెళ్ళే సరికి పవన్ రాజకీయ యాత్ర కూడా ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే మొదలవుతుంది.

ఈలోపు ఆయన గారి తెలంగాణ, రాయలసీమ మొక్కుబడి యాత్రలు పూర్తవుతాయి. కృష్ణా నుండి విజయనగరం దాకా ఈ ఆరు జిల్లాలు కీలకం. రేపు అధికారంలోకి రావాలనుకునే వారెవరికైనా ఇక్కడ మెజార్టీ సీట్లు గెలవాల్సిందే! 2014 ఎన్నికల్లో పవన్ అండతోనే ఈ జిల్లాల్లో తెలుగుదేశంకు మెజార్టీ సీట్లు వచ్చి అధికారం చేపట్టగలిగింది. కాని, రేపు ఎన్నికల్లో పవన్ మద్దతునిచ్చినా ఆయన అభిమానులు, పవన్ సామాజిక వర్గానికి చెందిన కాపులు తెలుగుదేశంకు ఓటేస్తారన్న గ్యారంటీ లేదు. అందుకే చంద్రబాబు పవన్ జనసేన పార్టీని విడిగా పోటీ చేయించి ఈ ఓట్లన్నింటిని జగన్‌కు పోకుండా డైవర్ట్ చేయాలని ప్లాన్ వేశారు.

పవన్ కాల్షీట్లను నిర్మాతలు కొంటారు. పవన్ సినిమాలను డిస్ట్రిబ్యూటర్లు కొంటారు. కాని చంద్రబాబు ఏకంగా పవన్‌నే కొనేసాడని టాక్! అందుకే ప్రచారంలో ఆయనను ప్యాకేజీ పవన్ అని విపక్షం విమర్శిస్తుంటుంది. చంద్రబాబు డైరెక్షన్ లోనే ఆయన రాజకీయయాత్ర మొదలుపెట్టాడు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఆయన యాక్షన్ చేస్తున్నాడు. రేపు ఎన్నికల్లో కూడా చంద్రబాబు ఏ ఏ సీట్లలో తన అభ్యర్థులను నిలబెట్టమంటాడో పవన్ అక్కడ మాత్రమే జనసేన అభ్యర్థులను దించుతాడు. తాను అన్ని సీట్లలో పోటీ చేయనంటున్నది కూడా అందుకే!

'అజ్ఞాతవాసి' సినిమాలో ఓ సీన్ వుంది... ఎన్ని కార్లున్నా చిన్నప్పటి నుండి సైకిల్ అంటే తనకిష్టమని ఆ సైకిల్‌ను పడనివ్వనని చెబుతాడు. రాజకీయాలలో తన ఉద్దేశ్యాన్ని సినిమాద్వారా ఈ విధంగా చాటుకున్నాడాయన! ఒక సిద్ధాంతం లేకుండా, ఒక ప్రజా ప్రాతిపదిక లేకుండా కేవలం చంద్రబాబు కోసమే పార్టీ పెట్టాడు పవన్. ఇలాంటి పార్టీలు, ఇలాంటి డైవర్షన్ నాయకులు రాష్ట్రానికి అవసరమా? ప్రజలు, అభిమానులు ఆలోచించాలి.

# పట్టుదలతో ఎంత లక్ష్యమైనా సాధించవచ్చు



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న పోకల సుబ్బారెడ్డి

పట్టుదల, సాధనతో ఎంతపెద్ద లక్ష్యాన్నైనా సాధించవచ్చునని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు పోకల సుబ్బారెడ్డి అన్నారు. గత నెల 30న నెల్లూరులోని నేతాజీ ఫైలెట్ హైస్కూలులో విద్యార్థులకు ఎన్ఎల్‌పి, మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూలు ప్రిన్సిపల్ ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ప్రతిఒక్క చిన్నారి లక్ష్యాన్ని ఏర్పరుచుకొని దాన్ని సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. సంస్థ డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి, ఎన్ఎల్‌పి ట్రైనర్ పి.సుబ్బారెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ డి.వాణి, హెచ్ఎం నరశింహారావు, ప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# చారిత్రాత్మక మైలురాయి!

(మొదటి పేజీ తరువాయి)

ఆరోజు ఈరోజు అని లేకుండా ప్రతిరోజూ జన హారతులతో, జయజయ ధ్వానాలతో జగన్ పాదయాత్ర పరుగులు పెడుతోంది. ఇడుపులపాయ నుండి ఇచ్ఛాపురం... ఆరు నెలలు... మూడు వేల కిలోమీటర్లు... ఈ చారిత్రాత్మక పాదయాత్రలో మొదటి వెయ్యి కిలోమీటర్ల మైలురాయికి నెల్లూరుజిల్లానే వేదికయ్యింది. వైసిపి అభిమానులకు ఇదో వేడుకయ్యింది. జనవరి 29వ తేదీన వై.యస్.జగన్ పాదయాత్ర వెయ్యి కిలోమీటర్లను అధిగమించింది. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని సైదాపురంలో వెయ్యి కిలోమీటర్ల పాదయాత్ర గుర్తుగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను వేలాదిమంది జనసందోహం నడుమ జగన్ ఆవిష్కరించాడు. జగన్ పాదయాత్ర ఆరోజు వెయ్యి కిలోమీటర్లకు చేరుకుంటున్న సందర్భంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో, అన్ని మండలాల నుండి వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పోటెత్తి రావడంతో సైదాపురం జనసంద్రమైపోయింది.

జనవరి 23వ తేదీన పెళ్ళకూరు మండలం పునబాక వద్ద జిల్లాలోకి జగన్ పాదయాత్ర ప్రవేశించింది. నాయుడుపేట, ఓజిలి, గూడూరు, సైదాపురం మండలాల మీదుగా సాగి బుధవారం మధ్యాహ్నాంకు పొదలకూరుకు చేరుకుంది. జగన్ పర్యటన ఇంకా నెల్లూరురూరల్, కోవూరు, ఆత్మకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాలలో మిగిలివుంది. ఇప్పటివరకు జగన్ పాదయాత్రకు జనం ఇసుకేస్తే రాలనంతగా వస్తున్నారు. జిల్లాలో జగన్‌కు వస్తున్న స్పందన చూసి చంద్రబాబుకు గుబులు పట్టుకుంది. జిల్లాలో వైకాపా బలం పుంజుకుందన్న సంకేతాలు, తన పార్టీలో సన్నయం లేదన్న సమాచారంతో చంద్రబాబు తన పార్టీ నాయకులపైనే కారాలు మిరియాలు నూరుతున్నట్లు సమాచారం.

# ఈ చిటపటలన్నీ సీట్లు పెంచలేదనేనా?



మీరు ప్రత్యేకహోదా ఇవ్వలేమన్నారు... మీరు ఇస్తామన్న ప్రత్యేకప్యాకేజీ నాకు చాలనుకున్నాను... దుగరాజపట్నం పోర్టు కుదరదన్నారు... అది నాకు సంబంధించిన పనికాదు కదా సరేనన్నాను. రాజధాని నిర్మాణానికి నిధులిస్తామన్నారు... నేను సింగపూర్ లాంటి రాజధాని కట్టుకుంటుంటే దానికి నిధులివ్వకుండా మీరు చంబల్‌పూర్ లాంటి పట్టణాన్ని కట్టుకోమన్నట్లుగా ముష్టి విదిలిస్తున్నారు. అయినా సర్దుకున్నాను. పోలవరం ప్రాజెక్ట్‌పై నేను పెంచిన అంచనాలను ఒకే చేయకుండా పాత అంచనాలతోనే పనులు చేసి పెట్టాలన్నారు. ఇక్కడా రాజీపడ్డాను. ఇవన్నీ దేని కోసం... రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతూ విభజన హామీలపై మీతో రాజీపడుతూ వచ్చింది ఎందుకోసం... మా రాష్ట్ర అసెంబ్లీ సీట్లను **175** నుండి **225**కు పెంచుతారని. నా నెత్తిన పాలు పోస్తారని కదా... సీట్లు పెరిగితే ఎంచక్కా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించవచ్చు. వైసిపి నుండి ఆల్‌రెడీ వచ్చిన ఎమ్మెల్యేలకే కాదు, ఇంకా వచ్చే వాళ్ళకు కూడా సీట్లు ఇవ్వొచ్చు. ఇదీ చంద్రబాబు మనోగతం.

ఆయన ఆశ, ధ్యాస అంతా కూడా నియోజకవర్గాల పెంపు మీదే వుంది. రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లను పెంచుతారనే ఆశతోనే ఇప్పటివరకు మోడీ ముందు సాగిలబడుతూ వచ్చాడు. అందుకోసమే కేంద్రం విభజన హామీలను అటకెక్కించినా ఇదేం పని అని అడగలేకపోయాడు. విభజన హామీలలో ఏ ఒక్కటీ అమలు చేయకపోయినా ఫర్వాలేదు, సీట్లు పెంచితే చాలన్నట్లుగా వుండింది ఆయన వాలకం. ఇటీవల లేకలేక ప్రధాని అపాయింట్‌మెంట్ దొరికితే ఈయన పోయి రాష్ట్రానికి ఏం కావాలో అడక్కుండా రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లను పెంచమని అడిగొచ్చాడు.

అసెంబ్లీ సీట్లపెంపుపై కేంద్రం నుండి ఎలాంటి హామీ రాలేదు. భవిష్యత్‌లో పెంచుతారనే వాతావరణం కూడా కన పడ్డం లేదు. ఇక్కడే చంద్రబాబులో నిరాశా వాదం అలుముకుంటోంది. ఇది కూడా చేయకుంటే ఇక బీజేపీతో పొత్తు ఎందు కనిపిస్తోంది. నిరాశావాదాన్ని ఆయన ఈమధ్య తన మాటల్లో చూపించాడు కూడా! పొత్తు వద్దనుకుంటే దండం పెట్టి పోతామని చెప్పాడు.

రాష్ట్రంలో టీడీపీ-బీజేపీ నాయకుల మధ్య తరచూ వివాదాలు రేగుతున్నాయి. రాష్ట్ర బీజేపీలో తెలుగుదేశంకు అమ్ముడు పోయిన వర్గం, వ్యతిరేక వర్గం అని రెండు న్నాయి. ఎంపీ కంభంపాటి హరిబాబు, మంత్రి కామినేని శ్రీనివాస్ తెలుగుదేశం అనుకూలవర్గంలో వున్నారు. వారు ఒక రకంగా తెలుగుదేశం నాయకులేనను కోవచ్చు. తెలుగుదేశంతో విభేదించే పురంధేశ్వరి, విష్ణుకుమార్‌రాజు, సోము వీర్రాజు లాంటి నాయకులు చంద్రబాబుపై ఒంటికాలితో లేస్తున్నారు. ప్రభుత్వ అవినీతిని, చంద్రబాబు పార్టీ ఫిరాయింపు చర్యలను ఎండగట్టడంలో ఎప్పటికప్పుడు వీళ్ళు ముందుంటున్నారు.

ఈ పరిణామాలన్నీ కూడా టీడీపీ-బీజేపీల మధ్య దూరం పెంచుతూ వచ్చాయి. రేపు కేంద్రం సీట్లు పెంచకుంటే ఆ దూరం మరింత పెరగొచ్చు కూడా! అది తెగదెంపులదాకా రావచ్చు. బీజేపీని దూరం చేసుకుంటే మైనార్టీలు దగ్గర అవుతారనే ఆశ చంద్రబాబులో వున్నట్లుంది. ఆ దిశగానే ఆయన బీజేపీతో కటీఫ్‌కు సిద్ధం కావచ్చు. అయితే ఇక్కడ ఆయన ఇంకోదానికి కూడా సన్నద్ధం కావాల్సి వుంటుంది. ఓటు-నోటు కేసు ఏ క్షణమైనా మళ్ళీ తెరమీదకు రావచ్చు. అది రావడం జరిగితే రాష్ట్రంలో రాజకీయాల సీన్ చాలా మారొచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన బీజేపీని దూరం చేసుకోవడమంటే... కోరి కొరివితో తల గోక్కోవడమే!

# మెరుపులు కాదు... సరికొత్త మార్పుల బడ్జెట్



**- చిన్ని శ్రావణ్‌కుమార్**
చార్టెర్డ్ అకౌంటెంట్

ఎలాంటి పైపై మెరుగులు లేని, ప్రజల అభ్యున్నతిని కాంక్షించిన బడ్జెట్ అరుణ్‌జైట్లీ రూపొందించిన 2018-19 బడ్జెట్ అంటే అతిశయోక్తి కాబోదు. తళుకుబెళుకులు దిద్దటం గత ప్రభుత్వాలకు అలవాటు. స్థిరంగా ధృడంగా నిర్ణయాలు తీసుకోవడం బీజేపీ ప్రభుత్వం తీసుకొన్న గొప్పనిర్ణయం.

ఇది వ్యవసాయబడ్జెట్‌గా మోదీ అభివర్ణించారు. దానికి తగ్గట్టుగానే ఆక్వా పరిశ్రమ, చేపల పెంపకాలను వ్యవసాయం కిందనే ప్రతిపాదిస్తూ ఆయా రంగాల వాళ్ళకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇచ్చి ప్రోత్సహించారు. వెదురుచెట్లను గ్రీన్‌గోల్డ్‌గా భావించి వాటి పెంపకాలకు 1290 కోట్లను కేటాయించడం జరిగింది. కౌలు రైతులకు పెద్దపీట వేస్తూ వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణ సదుపాయాలు కల్పించే గొప్ప ప్రతిపాదన చేసింది. భారతదేశం 1000 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేయగల్గిన సామర్థ్యం కలిగివుండి కూడా కేవలం 30 బిలియన్ డాలర్ల ఎగుమతుల్ని మాత్రమే చేయడం విచారకరం. అలాంటి విషాదాన్ని స్వీకరించి ఆనందమయ, ఆహ్లాదకర వాతావరణాల్ని సృష్టించే కొత్తదనం బిజెపి వారిది. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 2 వేల కోట్ల రూపాయల నిధితో 'అగ్రికల్చర్ మార్కెట్ ఇన్‌ఫ్రా ఫండ్'ను సృష్టించి ప్రజామోదయోగ్యంగా నిలబడే బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం మోదీ ప్రభుత్వ ప్రత్యేకతగా భావించవచ్చు.

ప్రపంచంలో భారతదేశం ఏడవ అతి పెద్ద ఆర్థికవ్యవస్థ అయినప్పటికీ నాణ్యమైన ఆహారపదార్థాల కొరత ఉండనే ఉంటుంది. దీన్ని అధిగమించడం కోసం ఆర్గానిక్ పంటల మీద ప్రత్యేక దృష్టి సారించింది. 2022 సంవత్సరంలో రైతు యొక్క ఆదాయాన్ని రెట్టింపు చేసే ఆలోచనతో బడ్జెట్‌ను రూపొందించారు జైట్లీ. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. కనీసం మంచి ఆహారం తీసుకోలేని దుస్థితి ఉంచి ఒక్కో అడుగు ముందుకేసి పరుగును లంకించుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించడం శుభసూచకం.

'ఆపరేషన్ గ్రీన్' ద్వారా మౌలిక సదుపాయాల్ని కల్పించి సంవత్సరం మొత్తానికి ఉపయోగపడే రీతిలో టమోటో, ఉల్లిపాయలు, నిమ్మకాయలు తదితర కూరగాయల నిల్వ కోసం 500 కోట్లు కేటాయించడం మరో శుభపరిణామం.

నెల్లూర్లో ప్రాముఖ్యత పొందిన చేపలు మరియు రొయ్యలు, పశుసంపదను కాపాడడం కోసం పదివేల కోట్ల నిధిని ఏర్పాటు చేయడం ఒక వరంగా భావించవచ్చు.

కాలుష్యం కోరల్లో చిక్కుకున్న మన రాజధాని ఢిల్లీ మరియు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్ని కాపాడే యంత్రాలకు సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించడం పర్యావరణానికి పెద్ద పీట వేసినట్లే అవుతుంది.

రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్‌ను సడలిస్తూ 13 లక్షల మందికి శిక్షణ ఇచ్చి విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేయడం జరిగింది. భారతదేశంలో వెయ్యి మంది బిటెక్ విద్యార్థులను గుర్తించి వాళ్ళను పిహెచ్‌డిలతో తీర్చిదిద్దేవిధంగా ముందుకు రావడం హర్షణీయం.

ఈ బడ్జెట్‌లో హర్షించదగిన మరో గొప్ప అంశం ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం కంకణం కట్టుకోవడమే. కుటుంబానికి సుమారు 5లక్షల రూపాయల వైద్యం అందేట్టు నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ స్కీమ్‌ను రూపొందించడం జరిగింది. ప్రభుత్వం మరో 24 మెడికల్ కళాశాలలను తీసుకునిరావడం అభినందనీయం. ప్రతి మూడు పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఒక ప్రభుత్వ వైద్యకళాశాల, హాస్పిటల్ రూపొందించే గొప్ప ప్రతిపాదన బిజెపి అందిస్తున్న వరంగా పేర్కొనవచ్చు.

బ్యాంకు లోన్లు, జిఎస్టీలో తమ టర్నోవర్‌ను నమోదు చేసినవాళ్ళకి మాత్రమే ఇచ్చే ప్రతిపాదన చేయడం చక్కని ఆలోచన. దీనితో బ్యాంకుల్లో ఇబ్బడిముబ్బడిగా రుణసదుపాయం పొందడాన్ని అరికట్టే వ్యక్తుల దారుణానికి అడ్డుకట్ట వేయడం సరైన ఆలోచనా విధానం.

అయితే, ఎంపీలకు, ద్రవ్యోల్బణాన్ని అనుసరించి జీతభత్యాలని పెంచే ప్రతిపాదన చేసిన ప్రభుత్వం వేతన జీవుల్ని విస్మరించడం నిరాశాజనకం. ఎన్నో ఆశలతో బడ్జెట్ కోసం ఎదురుచూసిన సామాన్యుడికి మొండిచెయ్యి చూపించడం విశేషం.

భారత ఆర్థిక రంగానికి వేతన జీవుడే ఆధారం అని చెప్పూనే వారికి ఎలాంటి ప్రోత్సాహకాలు, రాయితీలు ప్రకటించక పోవడం ఎంతో శోచనీయం.

వేతన జీవులకు 40వేల స్టాండర్డ్ డిడక్షన్ అనే కొత్త పదప్రయోగం చేస్తూ వారికి ప్రస్తుతం ఉండే ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను తీసేయడం కుడిచేత్తో ఇచ్చినట్టే ఇచ్చి ఎడంచేత్తో లాగేసుకోవడంలాగుందే తప్ప ఎలాంటి ప్రయోజనం చేకూరబోదు.

వృద్ధులకు మాత్రం ఊరట లభించింది. వృద్ధులను గౌరవిస్తూ 50వేల వడ్డీ వరకూ రాయితీ కల్పించింది.

ఇలా మోదీ ప్రభుత్వం ఎలాంటి ఆకర్షణలకు తావివ్వకుండా ఎలక్షన్ల కదనరంగంలోకి దూసుకెళ్ళబోతున్నది.



ఈ నెల 3వ తేదీన సౌత్‌మోపూర్‌లో జరిగే జగనన్న పాదయాత్రకు వచ్చి ఆశీర్వదించాలని కోరుతూ ఆ గ్రామంలో ఇంటింటికి వెళ్ళి మహిళలను ఆహ్వానిస్తున్న నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి శ్రీమతి సుజిత, కుమార్తె వైష్ణవి.

## నరసింహకొండ ఇ.ఓకు పదోన్నతి



నెల్లూరు రూరల్ నరసింహకొండలోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ముఖ్య కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డికి గ్రేడ్-1 ఇ.ఓగా పదోన్నతి లభించింది. ఈమేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ నుండి 31వ తేదీ ఉత్తర్వులు వచ్చాయి. పదోన్నతి పొందిన శ్రీనివాసులురెడ్డిని సహచర సిబ్బంది, మిత్రులు అభినందించారు.


**లీజుకు / బాడుగకు**

నెల్లూరు పొగతోటలో GNT రోడ్ ప్రక్కన రెండు అంతస్తుల భవనం (ఒక్కో అంతస్తు 1800 చ.అ.ల హాల్) రెస్టారెంట్స్‌కు, హాస్పిటల్స్, క్లాత్ షోరూమ్ లకు, విద్యాసంస్థలకు ఇతర వ్యాపారాలకు అనుకూలమైనది విశాలమైన పార్కింగ్ వసతితో బాడుగకు ఇవ్వబడును.

**98480 27360**





Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com